ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



ఆదివారం | 19-07- 2026 | సంపుటి: 17, సంచిక: 106, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


## నోటిఫికేషన్లు లేవు..

# లూటిఫికేషన్లే

- 70 వేల ఉద్యోగాల భర్తీ రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- అధైర్య పడొద్దు.. తెలంగాణ నిరుద్యోగులకు అన్నగా తోడుంటా
- సరూర్‌నగర్ 'యువ సంగ్రామ సదస్సు'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 18 (ప్రజాకలం) :

కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు సీఎం రేవంత్ రుజువు చేస్తే.. తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశా రు. బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ చోరీ చేస్తున్నారని, ఉద్యోగాలపై కాంగ్రెస్ నాయకులు కాకి లెక్కలు చెప్తూ నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ యువతను యూత్ డిక్లరేషన్ పేరు తో దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఇక డెత్ డిక్లరేషనే మిగిలిందన్నారు. యూత్ డిక్లరేషన్ ఇచ్చిన వేదికపైనే.. తెలంగాణ యువత కాంగ్రెస్‌కు 'డెత్ డిక్లరేషన్' రాస్తుందన్నారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఏ సరూర్ నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ పార్టీ 'యూత్ డిక్లరేషన్' బురిడీ పత్రాన్ని ఆవిష్కరించిందని, అదే వేదికపై ఇప్పుడు తెలంగాణ నిరుద్యోగ యువత కాంగ్రెస్ మోసాలను గ్రహించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. మాట తప్పి, నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే గడ్డపై నుంచి



యువత 'డెత్ డిక్లరేషన్' (రాజకీయ మరణ శాసనం) రాయడానికి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. మాయమాటలతో యువతను మోసం చేస్తామంటే కుదరదు అని, నిరుద్యోగుల ఉడుకు నెత్తురు, ఉరకలెత్తే ఆశయాల ముందు దగాకోరు రేవంత్ ప్రభుత్వం మోకరిల్లక తప్పదన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కల్తీల నిరోధానికి

# కఠిన చట్టం




## సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి

- చట్టం తయారీకి శాసనసభలో సమగ్ర చర్చ
- క్యూర్ పరిధిలో పైలెట్‌గా తొలుత అమలు
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 18 (ప్రజాకలం) :

ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు అన్ని కల్తీల బారిన పడుతుండడంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యాల బారిన పడుతున్నారని సీఎం అన్నారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టంపై ఎంసీహెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం తెలిపారు. ఎరువులు, పురుగు మందుల భారీ వాడకంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. మార్కెట్ లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలురకాల ఉత్పత్తులు అమ్ముతున్నారని, అధిక ధరలు ప్రజలు వాటిని కొంటున్నా... అవి సేంద్రియ ఉత్పత్తులే అని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. ఆయా అధ్యయనాల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను తయారు చేయాలన్నారు. దానిపై బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రమైన చర్చ చేపడతామని సీఎం తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలని సీఎం తెలిపారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణకు విజిల్ బ్లోయర్లను నియమించాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక్కడ నిబంధనలు అమలు చేసి వాటి అమలులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సి.వి.ఆనంద్, సీఎం సలహాదారు, ఎక్స్ ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, ఎన్.శ్రీధర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మహిళా శక్తి దీవెనలే మా ప్రభుత్వ బలం!**

మహిళా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేసేందుకు 22 జిల్లా కేంద్రాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తున్నాం... త్వరలోనే ప్రారంభించుకోబోతున్నాం .. ఈ ఇందిరా మహిళా శక్తి భవనాలను శిక్షణ, మార్కెటింగ్, వ్యాపారానికి కేంద్రంగా పనిచేసేలా కార్పొరేట్ హంగులతో నిర్మిస్తున్నాం హైటెక్ సిటీ ప్రాంతంలో శిల్పారామంకు అనుకుని

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




## చెక్ బౌన్స్ కేసుల్లో రాజీయే ఉత్తమం

- జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి

3

## స్కైరూట్ విక్రమ్-1

# విజయవంతం

**దేశీయ పరిజ్ఞానంతో అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ - భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర**




శ్రీహరికోట/ రంగారెడ్డి, జూలై18 : భారతదేశ అంతరిక్ష రంగ ప్రస్థానం లో సరికొత్త అధ్యాయం మొదలైంది. హైదరాబాద్‌కు చెందిన 'స్కైరూట్' ఎరోస్పేస్ అనే ప్రైవేటు సంస్థ రూపొందించిన 'విక్రమ్ -1' ఆర్బిటాల్ రాకెట్ శనివారం ఏపీలోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుం చి రాకెట్ రోదసిలోకి దూసుకెళ్లింది. దీంతో సంస్థ చేపట్టిన 'మిషన్ ఆగమన్' విజయవంతంగా పూర్తయినట్లయింది. ప్రయోగానికి ముందు అంతరాయాలు తలెత్తినా కాస్త ఆలస్యంగా ప్రయోగం మొదలై నాలుగు దశలను విజయవంతంగా దాటి నిర్ణీత కక్ష్యలోకి చేరింది. ఈ విజయంతో ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ లాంచ్ సామర్థ్యం కలిగిన 'ఎలైట్' దేశాల సరసన భారత్ చేరింది. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇలాంటి ప్రయోగం చేసి సక్సెస్ అయిన

తరువాయి 2వ పేజీలో...



## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

**రూ. 2.55 కోట్లతో పాఠశాలల ఆధునీకరణ**

**ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి,జూలై 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా సంస్థలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## అర్హులైన ప్రతి ఒక్కరికి

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలను సాగు చేయాలి**

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**నేలకొండపల్లి మండలంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రి పొంగులేటి**

పాలేరు జూలై- 18( ప్రజా కలం న్యూస్)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్న ర సంవత్సరాల్లో ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

తరువాయి 2వ పేజీలో...



## సంక్షేమ ఫలాలు అట్టడుగు

# వర్గాలకు చేరాలి

## ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

- పెండింగ్ సంక్షేమ నిధుల పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలి
- గురుకులాలు,కేజీబీవీలు,మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు
- ఐడీఓసీలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్




పెద్దపల్లి,జూలై18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఎస్సీ,ఎస్టీ వర్గాల సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయి లో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు,జె.అరుణ శ్రీలతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ,ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ఎస్సీ,ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే గురుకులాలు,సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాల యాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ,

తరువాయి 2వ పేజీలో...




# కల్తీల నిరోధానికి కఠిన చట్టం

మొదటి పేజీ తరువాయి...

రూ. 1,000 కోట్ల విలువైన స్థలాన్ని ఇందిరా మహిళా శక్తి బజార్ నిర్వహించడానికి కేటాయించాం .. ప్రత్యేక సదుపాయంలో, గ్రామీణ హస్తకళలు, సాంప్రదాయ ఉత్పత్తులను విక్రయించడానికి మహిళా స్వయం సహాయక బృందాలకు ప్రత్యేకంగా కేటాయించిన 150కి పైగా దుకాణాలు విజయవంతంగా నడుస్తున్నాయి అదే స్ఫూర్తితో మహిళా సాధికారత కోసం ఫిక్కీ అభ్యర్థనలను అత్యంత ప్రాముఖ్యతతో నెరవేరుస్తాం .. ఫిక్కీ ప్రధాన కార్యాలయం నిర్మించుకోవడానికి శిల్పారామం పక్కనే వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తాం .. హైటెక్ సిటీ, సిఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) కార్యాలయానికి మధ్యలో ఫిక్కీ కార్యాలయం ఆ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.

దీంతో పాటు ఫిక్కీని ఈ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగస్వామిని చేసే ఆలోచనతో .. భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీకి ఒక ఎకరం స్థలాన్ని కేటాయిస్తాం .. మహిళల అభ్యున్నతికి ఏమి చేసినా వ్యక్తిగతంగా నాకు చాలా సంతృప్తినిస్తుంది.

అమెజాన్ లాంటి దిగ్గజ సంస్థ ఫ్యూచర్ సిటీలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనుంది.. రానున్న రోజుల్లో ప్రపంచ అగ్రగామి ఫార్చ్యూన్-500 కంపెనీలనన్నింటినీ ఫ్యూచర్ సిటీ లో నెలకొల్పాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం .. దీంట్లో ఫిక్కీ తోపాటు మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర కీలకం కానుంది. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ పార్క్ విజయవంతమైన నేపథ్యంలో మరొక ఇండస్ట్రియల్ పార్క్ ను మహిళా సాధికారత కోసం అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలిస్తాం ... మహిళలు ఆర్థికంగా ఎదిగిన దేశాల్లో ఆర్థిక వృద్ధి మరియు జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయి.

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ 25 ఏళ్ళు పూర్తి చేసుకోవడం, 2027 లో ఫిక్కీ 100 ఏళ్ళు పూర్తి చేసుకోవడం సంతోషం ..

జులై 4, 2006లో జడ్పీటీసీగా మొదలైన నా రాజకీయ ప్రస్థానం .. ఎమెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, ఇప్పుడు ముఖ్యమంత్రిగా కేవలం 17 సంవత్సరాల్లో విజయవంతంగా సాగింది .. ఈరోజు ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ మహిళా వ్యాపారవేత్తలతో సమావేశం కావడం ఆనందకరం

మహిళా పారిశ్రామికవేత్తలను శాయ శక్తులా ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నాం .. మహిళా పారిశ్రామికవేత్తలతో ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహిస్తా ..

తెలంగాణలో మహిళా పొదుపు సంఘాలు సరికొత్త విప్లవాన్ని సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో దాదాపు 67 లక్షల సంఘాలు ఉన్నాయి. వీటికి 16,000 కోట్ల రుణాలు అందాయి.

ఇప్పుడు మన మహిళలు పెట్రోల్ బంకులను కూడా నిర్వహిస్తూ, కార్పొరేట్ దిగ్గజాలతో పోటీ పడుతున్నారు.

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణాలకు ఇప్పటిదాకా మా ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు చెల్లించాం ..

ఈ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని అనుకుంటున్నారు .. వాస్తవానికి మహిళలే వెయ్యి బస్సులకు యజమానులుగా మారి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చి నడుపుతున్నారు .. ఉచిత ప్రయాణాలు కాదు .. మహిళలే ఆర్టీసీ బస్సులకు యజమానులు

ఇందిరా మహిళా శక్తి పథకం కింద, మహిళా స్వయం సహాయక బృందాల యాజమాన్యం, నిర్వహణలో 1,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా 27,000 ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా స్వయం సహాయక బృందాలకు అప్పగించాం

27 లక్షల 50 వేల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫారాలు కుట్టే బాధ్యతను మహిళా స్వయం సహాయక బృందాలకు అప్పగించాం. ఒక్కో యూనిఫారానికి రూ.75 చొప్పున చెల్లిస్తున్నాం

రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేసాం

మహిళా సంఘాల ఉత్పత్తులను అమెజాన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా విక్రయించే దిశగా పనిచేస్తున్నాం

వ్యాపారాల్లో గొప్పగా రాణిస్తున్న మహిళా సంఘాలకు ఫిక్కీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అవార్డులు ఇచ్చి గౌరవించుకునే ఆనవాయితీ తీసుకురావాలి

వికసిత్ భారత్ 2047 లక్ష్యమైన 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలో, 2.5% జనాభా ఉన్న తెలంగాణ దేశ జీడీపీ లో తన వాటాను 5% నుండి 10%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.. 2034 కల్లా 1 ట్రిలియన్, 2047 కల్లా 3 ట్రిలియన్

డాలర్ల లక్ష్యంగా పెట్టుకున్నాం

ఈ దేశానికి మహిళలను అత్యంత ఉన్నత స్థానాల్లో ప్రోత్సహించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది .. ప్రధాన మంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు, జడ్జిలు, గవర్నర్ లుగా మహిళలను కాంగ్రెస్ ప్రోత్సహించింది

సోనియా గాంధీ 2013లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ ఇప్పటివరకు అది అమలు కాలేదు, వచ్చే ఎన్నికల తర్వాత అమలవుతుందని ఆశిస్తున్నా

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం సలహాదారు రామకృష్ణా రావు, ఎఫ్ఎల్ వో జాతీయ అధ్యక్షురాలు పూజా గర్గ్, ఎఫ్ఎల్ వో హైదరాబాద్ చైర్పర్సన్ సీతా రెడ్డి గడ్డం, సహా అనేక మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు

# నోటిఫికేషన్లు లేవు..లూటిఫికేషన్లే

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ యువతను జిత్తులమారి ముసలి నక్కలా కాంగ్రెస్ పార్టీ తెలివిగా చిత్తు చేసిందన్నారు. శనివారం సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడారు. 60 ఏళ్ల తెలంగాణ నెత్తురు రుచి మరిగిన కాంగ్రెస్.. కొత్త డూప్లికేట్ రూపాల్లో వచ్చి నకిలీ ప్రేమను కురిపించి యువతను బలిపీఠం ఎక్కించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ పెద్ద మోసం అన్న కేటీఆర్, ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ఓ బురిడీ పత్రాన్ని విడుదల చేశారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, ప్రియాంకలు చేసిన మోసానికి యువత గుణపాఠం చెపుతుందన్నారు.

**అంతా 'లూటిఫికేషన్'..**

రాహుల్ గాంధీ ప్రచారం చేసుకునే 'మొహబ్బత్ కీ దుకాణ్' (ప్రేమ దుకాణం) తెలంగాణ యువత పాలిట 'గద్దారీ కా మకాన్' (ద్రోహుల ఇల్లు) గా మారిందని విమర్శించారు. రాహుల్‌కు తెలుగు రాదు కాబట్టి, తెలంగాణ యువత పడుతున్న వేదనను ఆయనకు అర్థమయ్యే భాషలోనే చెబుతానంటూ హిందీలో మాట్లాడారు. మూడేళ్ల క్రితం అశోక్ నగర్ చౌరస్తాలో ఛాయ్ తాగుతూ నిరుద్యోగులతో దిగిన ఫోటోలు, ఇచ్చిన జూటా హామీలు గుర్తున్నాయా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. దేశమంతా రాజ్యాంగం పట్టుకుని ప్రజాస్వామ్యం గురించి మాయమాటలు చెప్పే రాహుల్ గాంధీ తెలంగాణలోని నిరుద్యోగుల వీపుల పైన పోలీస్ లాఠీలు మోగుతుంటే, అక్రమ కేసులతో ఆడబిడ్డలను కూడా చూడకుండా అణిచివేస్తుంటే రాహుల్ గాంధీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో జరుగుతున్న అప్రజా స్వామిక అరాచక అణిచివేత చూడకుండా కళ్ళు మూసుకొని ఢిల్లీలో గుడ్డి గుర్రాల పండ్లు తోముతున్నారా అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని, తమకు ఇచ్చిన హామీల అమలును ఉద్యోగాల భర్తీ గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తే ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో వేధింపులతో అవహేళనతో అణిచివేతకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన 'యూత్ డిక్లరేషన్' హామీల పరిస్థితి ఏమైందని, అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఇస్తామన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగా లు ఏమయ్యాయి, జాబ్ క్యాలెండర్‌తో పాటు 4,000 నిరుద్యోగ భృతి ఏదని ప్రశ్నించారు. లక్షలాది మంది అభ్యర్థులు కొలువుల కోసం రోడ్లపైకి వస్తుంటే, ఈ ప్రభుత్వం ఉద్యోగాల 'నోటిఫికేషన్' ఇవ్వడం పక్కనబెట్టి, కేవలం 'లూటిఫికేషన్' (దోపిడీ)లో మునిగిపోయిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో 'ఓటు కొట్టు.. జాబ్ పట్టు' అని పత్రికల మొద టి పేజీల్లో ఫుల్ పేజ్ ప్రకటనలు ఇచ్చిన కాంగ్రెస్, నేడు ఏడాది దాటినా జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు రావడం లేదు కానీ, రేవంత్ రెడ్డి బినామీల బీరువాలు నిండుతున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నింపే పనిలో బీజీగా ఉన్న రేవంత్ రెడ్డి, ఇంక జాబులు ఎక్కడి నుంచి ఇస్తారని ఎద్దేవా చేశారు. అశోక్ నగర్, దిల్‌షుక్ నగర్ వేదికగా కొలువులు అడుగుతున్న నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి సర్కార్ లాఠీఛార్జీలు, అర్ధరాత్రి అరెస్టులతో దమనకాండ సాగిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగాలు అడిగితే 'ఎండ్రిన్ తాగి చావండి, బావిలో దూకండి' అన్న రేవంత్ అహంకారానికి రాబోయే రోజుల్లో యువత ఘోరీ కట్టడం ఖాయమన్నారు.

**ఇకపై మరొక లెక్క..**

కాంగ్రెస్ చేస్తున్న మోసాలను చూస్తూ కూడా తెలంగాణ మేధావులు మౌనంగా ఉండడం ఆవేదన కలిగిస్తోందన్నారు. 'జీనా హై తో మర్నా సీఖో.. కదమ్ కదమ్ పర్ లడ్నా సీఖో' అంటూ కొట్లాడిన యువతరం ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే పాలకుల కుర్చీలు కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. విద్యార్థులను కేసుల్లో ఇరికించి వారి భవిష్యత్‌ను దెబ్బతీసే పనులను బీఆర్ఎస్ ప్రోత్సహించదని, ప్రజాస్వామ్యయుతంగానే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడతామని తెలిపారు. 'యువతకు ఏ కష్టం వచ్చినా ఒక అన్నగా, సోదరుడిగా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. 2028లో ఖచ్చితంగా మళ్ళీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారు. రాబోయే ప్రభుత్వంలో యువత ఆకాంక్షలకు న్యాయం చేసే బాధ్యత నాది' అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రస్తుతం యువతను దారుణంగా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని కూడా నిరుద్యోగుల తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎలాంటి దుర్మార్గులకి, మోసకారి నాయకులకి పార్టీకి ఓటు వేసి గెలిపించుకున్నారో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. పంటలకు నీళ్లు అడిగితే కోసి నెత్తురు చల్లుకోండి అంటున్నాడు, మరోవైపు బిడ్డలు కొలువులు అడిగితే ఎండ్రిన్ తాగి చాగ తాగండి బాయిలో దూకండి అంటున్నారు, ఇంతటి ఉన్మాదం, అహంకారం తలకెక్కిన దుర్మార్గుడికి ఓట్లు వేసిన విషయాన్ని గుర్తుంచుకొని తగిన సమయంలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రూప్- ఉద్యోగాల భర్తీ నుంచి మొదలుకొని డీఎస్సీ వరకి అన్ని అంశాల్లో చెప్పిన మాటలు మరిచి నిరుద్యోగులను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డిని నిలదీస్తే నిరుద్యోగులను పెయిడ్ ఆర్టిస్టులు శంకినీలు అంటూ అడ్డగోలుగా అవమానకరంగా మాట్లాడారని గుర్తు చేశారు. డీఎస్సీ, మెగా డీఎస్సీ వేస్తా అన్న రేవంత్ రెడ్డి, వేసిన డీఎస్సీ కూడా ఇంత అడ్డగోలుగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి అహంకారం, బలుపు మాటలను తెలంగాణ యువత మరిచిపోదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇంతటి నీచమైన మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రిని నిరుద్యోగ యువత ఏమాత్రం క్షమించదని హెచ్చరించారు. యువతకి కాంగ్రెస్ పైన పొట్టు పొట్టు కోపం ఉన్నదని ఓటు పెట్టుకొని మరి కాంగ్రెస్‌కి గోరీ కడతారన్నారు. రేవంత్ రెడ్డి తాను నమ్ముకున్న నియంతా హిట్లర్ కంటే దారుణమైన ముగింపును చూడబోతున్నారన్నారు.

**ప్రజాస్వామికంగా పోరు..**

నిరుద్యోగ విద్యార్థుల కష్టాలు, వారు ప్రిపరేషన్ సందర్భంగా పడే బాధలు తనకు తెలుసు అని, వారి ఆకలి అవస్థలు పట్ల నాకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు, నిరుద్యోగ యువకుల తల్లిదండ్రుల ఆకాంక్షలు కూడా తెలుసు అన్నారు. అందుకే రానున్న రోజుల్లో వారందరికీ ఒక అన్నగా అండగా ఉండి వారి ఆకాంక్షల కోసం వారి అవకాశాల కోసం పోరాటం చేస్తానని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

ఒక విద్యార్థిగా అనేక పరీక్షలు రాసి పూణే తో పాటు న్యూయార్క్ యూనివర్సిటీ వరకు సీట్లు సాధించి ఎవరి పైరవీలు లేకుండా ఉద్యోగం సాధించుకున్న తనకు ఉద్యోగ సాధన ఇంత కష్టమైనదో దాని కోసం ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో తెలుసు అన్నారు. కానీ ఎలాంటి ఉద్యోగాల కోసం ఒక్క రోజు కూడా ప్రయత్నం చేయని రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లాంటి వాళ్లు అడ్డగోలుగా విద్యార్థుల పైన మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు అక్రమాలు చేసినా తాను నేపాల్ మాదిరి ఒక విధ్వంసానికి పిలుపు ఇవ్వడం లేదు అని, కేవలం ప్రజాస్వామికంగా కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతూ వారి పైన పోరాటం చేయాలని మాత్రమే పిలుపునిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. కేవలం విద్యార్థులను కేసుల్లో ఇరికిచ్చి రాజకీయాలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఏనాడు ఆలోచించదు అన్నారు. ఒకవైపు తమ భవిష్యత్తు గురించి ఆలోచించుకుంటూనే భవిష్యత్తును నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీతో పాటు జాబ్ క్యాలెండర్ల వంటి అన్ని అంశాల్లో యువతకు సంబంధించి అన్ని ఆకాంక్షలను పరిగణలోకి తీసుకొని ఒక అన్నగా ముందుకు పోతామని వారి వెంట నిలుస్తానని భరోసా ఇచ్చారు. మరోవైపు టీ స్టార్టప్ అయిన స్కైరూట్ సంస్థ ప్రయోగించిన మొదటి రాకెట్ ప్రయోగానికి సంబంధించిన విజయాన్ని అందరూ అభినందించాలని కోరారు. ఈ సం దర్భంగా మాట్లాడిన నిరుద్యోగ యువత కాం గ్రెస్ తమకు చేసిన ద్రోహాన్ని వివరించారు. ఇక ఈ సదస్సుకు హాజరైన బీఆర్ఎస్ సీనియన్ నేతలు సభాప్రాంగణం చివరలో కూర్చుని కేటీఆర్‌కు కుడి ఎడమలుగా యువతను కూర్చోబెట్టడం పలువురిని ఆకర్షించింది.

# స్కైరూట్ విక్రమ్-1 విజయవంతం

మొదటి పేజీ తరువాయి...

ప్రపంచంలోనే మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ఏడంతస్థుల ఎత్తు ఉన్న ఈ విక్రమ్ రాకెట్ పూర్తిగా కార్బన్ కాంపోజిట్‌తో నిర్మితమైంది. దీని బరువు సుమారు 350 కిలోలు. శాస్త్రవేత్తలు రాకెట్‌ను అత్యాధునిక త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతతో రూపొందించారు. రాకెట్‌లో గ్రాహ స్పేస్, కాస్మోసర్వ్,డీక్యూబ్ సంస్థలకు చెందిన సాంకేతిక పేలోడ్లు సైతం ఉన్నాయి. వీటితో పాటు ప్రధాని మోదీ స్వహస్తాలతో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటితో పాటు స్కైరూట్ ఉద్యోగులు, సిబ్బంది, ఇన్వెస్టర్లు, శాస్త్రవేత్తల దస్తూరితో రాసిన మరికొన్ని కార్డులను కూడా రాకెట్ మోసుకెళ్లింది. అలాగే, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాముల సందేశాలు, వజ్రాలతో చేసిన తామర పువ్వు, బంగారు రాకెట్ నమూనా, సర్ సీవీ రామన్, ఏపీజే అబ్దుల్ కలాం, విక్రమ్ సారాభాయ్ చిత్రాలూ ఉన్నాయి. దేశీయ పరిజ్ఞానంతో మొదటి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ ఇదే

**2018లో సంస్థ ప్రారంభం**

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్‌కుమార్ చందన, నాగభరత్ డాకా 2018లో ఈ ఏరోస్పేస్ సంస్థను స్థాపించారు. చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో అంతరిక్ష సేవలను అందించాలనే లక్ష్యంతోనే సంస్థ ప్రారంభమైంది.

గతంలో 2022లో ఈ సంస్థ ప్రయోగించిన 'విక్రమ్-ఎస్', తాజాగా విక్రమ్--1 విజయంతో వాణిజ్య అంతరిక్ష మార్కెట్‌లో దేశీయ ప్రైవేట్ పరిశ్రమల సత్తాను సంస్థ ప్రపంచానికి చాటిచెప్పింది.

'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన ఈ ప్రయోగం లక్షలాది మంది కలలకు ప్రతిరూపమని సంస్థ అభివర్ణించింది. రాకెట్‌కు సంబంధించిన అత్యంత క్లిష్టమైన ఏవియానిక్స్ సిస్టమ్స్‌ను సైతం హైదరాబాద్ ల్యాబ్‌లో తయారు కావడం విశేషం. అలాగే, రాకెట్ అసెంబ్లింగ్‌తోపాటు కీలక పరీక్షలన్నీ హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోనే జరగడం గమనార్హం.

**ఫోన్‌లో ప్రధాని మోదీ అభినందలు**

చారిత్రాత్మక విజయం సాధించిన స్కైరూట్ సీఈవో పవన్‌కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు నాగభరత్ డాకాతోపాటు శాస్త్రవేత్తల బృందానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాల్ చేసి అభినందించారు. బృందంలో 25 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులే ఉండటం సంతోషాన్నిచ్చిందన్నా రు. ఈ విజయం నవతరం ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకమని కొని యాడారు. ప్రయోగ సమయంలో తాను కూడా బృందంతో కలిసి అక్కడే ఉండాలని భావించానని, కానీ, 'షార్'కు వెళ్లడం కుదరలేదని తెలిపారు. అంతరిక్ష రంగ ప్రయోగాల్లో ప్రైవేట్ సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలనే లక్ష్యం ఈ ప్రయోగంతో నెరవేరిందని వెల్లడించారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

మొదటి పేజీ తరువాయి...

పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట,రాగినేడు,తుర్కల మద్దికుంట, నిట్టూరు,బొంపల్లి,పెద్దకల్వల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.2.55 కోట్ల డి.ఎం.ఎఫ్.టి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా పెద్దకల్వలలో రూ.5 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించడంతో పాటు,బొంపల్లి ఆర్ అండ్ బి రోడ్డు నుండి తెనుగుపల్లి వరకు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన బి.టి.రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.గత పాలకులు నిర్లక్ష్యం చేయడం వల్ల నిర్వీర్యమైన ప్రభుత్వ పాఠశాలలను నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఆధునీకరిస్తున్నామని,ఇందులో భాగంగానే ఇప్పటికే పెద్దపల్లి మండల పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి అదనంగా రూ.5.70 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.మధ్యాహ్న భోజనంతో పాటు పౌష్టిక విలువలతో కూడిన ఉదయం అల్పాహారాన్ని అందించడం వల్లే ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని,దీని ఫలితంగానే పెద్దపల్లి జిల్లా విద్యారంగంలో రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా నిలిచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని చెబుతూ,పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు,ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

మొదటి పేజీ తరువాయి...

శనివారం సాయంత్రం పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలంలో మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. రూ. 177.20 లక్షల అంచనా వ్యయంతో కోనాయిగూడెం నుండి నాచేపల్లి వయా ఆరెగూడెం, గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగరం వరకు గల బి.టి రోడ్డులో వంతెన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం సదాశివపురం లో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యలయం భవనం ను, అంతకుముందు కోరట్లగూడెం గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లలను మంత్రి ప్రారంభించారు. అలాగే వివిధ రకాల వైద్య చికిత్సలు చేయించుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అనేక రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, మౌళిక వసతుల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరికొన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతి రహదారిని దశలవారీగా సిమెంట్ రోడ్డుగా మార్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అర్హులైన పేదలకు ఇప్పటికే వైద్య సహాయం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన ఖర్చుతో సమానంగా రెండున్నర సంవత్సరాల్లోనే వైద్య సహాయాన్ని ప్రజలకు అందించడం ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. పేద కుటుంబాలు కూడా పెద్దవారు తినే నాణ్యమైన సన్నబియ్యాన్ని పొందేలా రేషన్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. గతంలో రేషన్ కార్డులు పొందలేకపోయిన అర్హులైన కుటుంబాలకు ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. రైతులకు ప్రతి ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలకు విడతల వారీగా ఎలాంటి మధ్యవర్తులు, అవినీతి లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. మొదటి విడత అనంతరం రెండో, మూడో, నాలుగో విడతల నిధులు కూడా దశలవారీగా విడుదల చేసి ప్రతి అర్హత పేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలున్నందున నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటల సాగుపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల భూమికి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కేవలం బోరు నీటిపై ఆధారపడి మొత్తం విస్తీర్ణంలో సాగు చేపట్టడం ప్రమాదకరమని, తొందరపడి నిర్ణయాలు తీసుకుంటే మధ్యలో నీటి కొరత ఏర్పడి పంటలు నష్టపోయే అవకాశం ఉందని సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత పెరిగితే సాగునీటి సరఫరాకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, రైతులు ధైర్యంగా ఉండాలని మంత్రి భరోసా ఇచ్చారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను నివారించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలి

మొదటి పేజీ తరువాయి...




మౌలిక వసతులు,విద్యా ప్రమాణాల పై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి ఎస్సీ,ఎస్టీ బాధితుల పరిహారానికి సంబంధించిన 50 శాతం నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం,ఎస్సీ,ఎస్టీ బాధితుల పరిహారం,గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ నిధులు ఎంత ఉన్నాయో పూర్తి వివరాలను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నందున, పెండింగ్‌లో ఉన్న అన్ని నిధుల విడుదల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, మిగిలిన నిధులన్నింటినీ విడుదల చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు,మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేకుండా పూర్తి విద్యార్థి సామర్థ్యంతో నిర్వ హించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు,మున్సిపల్ కార్పొరేషన్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ,ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఉపాధి కల్పనలో ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని,ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే అన్ని ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.రిజర్వేషన్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేసి,అర్హులైన ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ అధికారులను ఆదేశించారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి,నిబంధనల ప్రకారం సత్వర విచారణ నిర్వహించి ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.నిజమైన బాధితులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీ వర్గాల సంక్షేమం,అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.కమిషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు.విద్య,ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి,గురుకుల విద్యాసంస్థల బలోపేతం,ఎస్సీ,ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు,కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్,కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్,రేణికుంట ప్రవీణ్,ఆర్డీవోలు, బి.గంగయ్య,సురేష్,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్,ఏసీపీ రమేష్,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

### చెరువులో ప్రమాదవశాత్తు

## నీట మునిగి బర్ల కాపరి మృతి

**- మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ**



ఎండపల్లి, జూలై 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఎలుక లస్మయ్య తండ్రి కిష్టయ్య వయస్సు 68 సంవత్సరాలు కులం యాదవ అను అతడు గ్రామంలోని బర్రెలు మేపుకుంటూ జీవిస్తాడు తేది 17.07.2026 శుక్రవారం రోజున ఉదయం 10:00 గంటలకు గ్రామం లోని బర్రెలను మేపు కుంటూ చెరువు వద్దకు వెళ్ళినాడని రాత్రి అయిన తిరిగి ఇంటికి రాలేదని దాంతో తన భర్త గురించి వెతకగా 18.07.2026 శనివారం రోజున ఉదయం 06:00 గంటలకు చెరువు లో లక్ష్మయ్య శవం లభ్య మైనదని చెప్పి తన భర్త లస్మయ్య ఇంటి నుంచి బర్రెలను మేపడానికి వెళ్లి అట్టి బర్రెలు గ్రామా శివారు లో గల చెరువులోకి పోగా వాటిని తోలడానికి లస్మయ్య చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించి నాడని అతని భార్య ఎలుక దేవేంద్ర ఇచ్చిన ఫిర్యాది మేరకు కేసు నమోదు చేయటం జరిగింది. తదుపరి విచారణ కొనసాగుతుందని వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

## కొత్తపేట పాఠశాల లో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల ఎన్నికలు

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి**




ఎండపల్లి, జూలై 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో తేదీ 18.7.2026 శనివారం రోజున పాఠశాల లో ప్రజాస్వామ్య పద్ధతి లో విద్యార్థిని, విద్యార్థులకు ఎన్నికలు జరిగాయి హెడ్ బాయ్, హెడ్ గర్ల్ నియా మకం కొరకై విద్యార్థుల ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సీనియర్ విద్యార్థుల నుండి నలుగురు బాలురు, నలుగురు బాలికలు పోటీలో ఉన్నారు. పోలింగ్ నిర్వహించుట కొరకు విద్యార్థులని పోలింగ్ సిబ్బందికి నియామకం చేసి పోలింగ్ నిర్వహించామని విద్యార్థులంతా ఉత్సా హంగా విద్యార్థి ఎన్నికల్లో ఓటర్లుగా పాల్గొని తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. ఈ ఎన్ని కల కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి, ప్రధానో పాధ్యాయు రాలు వి రాజామణి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు విద్యార్థి ఎన్నికల కార్యక్రమం లో పాల్గొన్నారు. విద్యార్థి ఎన్నికల లో గెలిచిన హెడ్ బాయ్ అరిగెల నాగ చైతన్య, హెడ్ గర్ల్ మేకల స్పందన లను పాఠశాల నిబంధనల మేరకు ప్రమాణ స్వీకారం చేయించి నట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు వి రాజామణి తెలిపారు.

## ట్రాఫిక్ పోలీస్ సేవా స్ఫూర్తికి ప్రజల ప్రశంసలు

**సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు చేసిన ట్రాఫిక్ పోలీస్ అబ్దుల్ రజాక్ మొహమ్మద్ అక్తర్**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 18 (ప్రజ కలం) విధి నిర్వహణతో పాటు సామాజిక బాధ్యతను చాటుకుంటూ మెట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి చెందిన అబ్దుల్ రజాక్ మొహమ్మద్ అక్తర్ ఆదర్శంగా నిలిచారు. మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని లాల్‌బహదూర్ శాస్త్రి చౌరస్తా వద్ద గత కొన్ని రోజులుగా రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలకు అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో సమస్య అలాగే కొనసాగింది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీస్ అబ్దుల్ రజాక్ మొహమ్మద్ అక్తర్ ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చులతో సిమెంట్, రాళ్లు కొనుగోలు చేసి ప్రమాదకరమైన గుంతలను పూడ్చించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు, పాదచారులకు ఉపశమనం లభించింది. అక్తర్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ప్రజా సమస్యను తన సమస్యగా భావించి స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిష్కరించడం నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని కొనియాడారు. ఆయన సేవా స్ఫూర్తి ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు పేర్కొన్నారు.



## ఎండపల్లి మండల బీజేపీ కార్యవర్గ సమావేశం

ఎండపల్లి, జూలై 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం లో భారతీయ జనతా పార్టీ మండల కార్య వర్గ సమావేశం ఘనంగా నిర్వహించ బడింది. ఈ సమావేశం లో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి నిర్మాణం, సభ్యత్వ నమోదు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, అలాగే రాష్ట్రం లో నెలకొన్న నిరుద్యోగం, రైతుల సమస్యలు, తాగు నీటి కొరత, దెబ్బతిన్న రహదారులు, అవినీతి వంటి ప్రజా సమస్యల పై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏక గ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ను ప్రతి ఇంటికి తీసుకెళ్లి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయా లని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎండపల్లి మండల బీజేపి పార్టీ అధ్యక్షులు రావు హనుమంతరావు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒరగంటి చంద్రశేఖర్, ధర్మపురి అసెంబ్లీ ఇన్‌చార్జ్ కన్నం అంజయ్య, ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు,



జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి,ఎస్ఐఆర్ ధర్మారం-ఎండపల్లి మండల ఇన్‌చార్జ్ లక్ష్మణ్, యువ మోర్చా జగిత్యాల జిల్లా కార్యదర్శి ఈర్ల నవీన్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం రమేష్, యువ మోర్చా అధ్యక్షులు జక్కుల సాగర్, కిసాన్ మోర్చ అధ్యక్షలు సబ్బు సంతోష్, బిఎంఎస్ అధ్యక్షలు అనంద్ మండల ప్రధాన కార్యదర్శులు పొన్నం నరేష్, మేడిపల్లి రాజశేఖర్, మంచికట్ల రవి, ఉపాధ్యక్షలు గోపనవేని గంగాచలం, కట్కూరి వెంకటేశ్, కార్యదర్శులు మామిడిపల్లి రమేష్, మీడియా కన్వీనర్ జెల్ల శ్రీనివాస్, శక్తికేంద్ర ఇంచార్జ్ లు, బూత్ అధ్యక్షులు, బీజేపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసుల్లో రాజీయే ఉత్తమం




**- జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 18(ప్రజ కలం) చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ చేసుకోవడమే ఉత్తమం అని మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెక్ బౌన్స్ లాంటి డాక్యుమెంట్ ఎవిడెన్స్ కేసుల్లో కంటెస్టింగ్ కన్నా, రాజీ చేసుకోవడానికే కక్షిదారులు ప్రయత్నించాలని సూచించారు. కేసుల్లో పరస్పరం రాజీ పడటం వలన సమయం తో పాటూ, ఖర్చులూ ఆదా అవుతాయాని అన్నారు. ఈనాటి ప్రత్యేక లోక్ అదాలత్ లో 15 పెండింగ్ కేసుల్ని రాజీ ద్వారా పరిష్కరించినట్టు తెలిపారు. నేటి లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన పోలీసులకు, సహకరించిన న్యాయవాదులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి , ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, మీడియాషన్ కో ఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేశ్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్, లోక్ అదాలత్ మెంబర్లు వడ్డేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, న్యాయవాదులు దండబోయిన యాదగిరి, గడ్డం శంకర్ రెడ్డి, పసునూరి సుదర్శన్, మామిడిపల్లి విజయలక్ష్మి, కటకం వేణుగోపాల్, రాంపల్లి జగన్, గురిజెల గోపి, బర్ల సంతోశ్, తలారి రాజ శేఖర్, కీర్తి దినేశ్, కోల అశోక్, అందె సంజయ్ పాల్గొన్నారు.

## గోదావరి వంతెన పై బస్సుల ఢీ

**త్రుటిలో తప్పిన ప్రమాదం - డ్రైవర్ కు స్వల్ప గాయాలు**

మల్లాపూర్, జూలై 18 (ప్రజాకలం ప్రతినిధి):

మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్--బాధనకుర్తి గోదావరి వంతెనపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. మెట్‌పల్లి నుంచి ఖానాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఖానాపూర్ నుంచి మెట్‌పల్లి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే వెనుక నుంచి వస్తున్న కారు బస్సును ఢీకొనడంతో కారు ముందు భాగం దెబ్బతింది. ఈ ఘటనతో వంతెనపై దాదాపు గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికుల కథనం ప్రకారం, మెట్‌పల్లి నుంచి ఖానాపూర్ వెళ్తున్న బస్సు డ్రైవర్‌కు ఒక్కసారిగా అస్వస్థత కలగడంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం గోదావరి వంతెనపై జరగడంతో క్షణాల్లోనే స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న మల్లాపూర్ ఎస్సై అనిల్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





## తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి



**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి,జూలై18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని,తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభ కనబరుస్తారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.శనివారం పెద్దపల్లి మండలంలోని తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పాఠశాలలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి,విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు,తల్లిదండ్రుల బాధ్యతలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని,జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతుల పనులన్నింటినీ రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్యం సాధించడంలో తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని,ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్-టీచర్ సమావేశాలకు హాజరై తమ పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కలెక్టర్ తెలిపారు.ఏదైనా కారణంతో కొద్ది రోజులు పాఠశాలకు రాలేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని,తద్వారా వారు మిస్సైన పాఠాలను ప్రత్యేకంగా బోధించే అవకాశం ఉంటుందని అన్నారు.ప్రతి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కొంత సమయం పిల్లలతో గడపాలని,పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో,హోంవర్క్ ఇచ్చారా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ హోంవర్క్ పూర్తి చేసేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు.తల్లిదండ్రులు ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి తమ పిల్లల విద్యా పురోగతి,ప్రవర్తన గురించి ఉపాధ్యాయులను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.తల్లిదండ్రుల సంపూర్ణ సహకారం లభిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ.శారద,జి.సి.డి.ఓ. కవిత,సర్పంచ్ రాజయ్య,ఉప సర్పంచ్ తిరుపతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజు లత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,తదితరులు,పాల్గొన్నారు.

## ఆర్ కృష్ణయ్య తో జాజాల రమేష్ భేటీ

ధర్మపురి, జూలై 18 : (ప్రజా కలం ప్రతినిధి) హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య గారిని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జాజాల రమేష్ మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సంద ర్భంగా ఆర్ కృష్ణయ్య ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఇతర బడుగు బలహీన



వర్గాల సంక్షేమం, విద్య, ఉపాధి, యువత సాధికారత, సామాజిక న్యాయం తదితర అంశాల పై ఇరు వురు చర్చించారు. జాజాల రమేష్ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా విద్యా ర్థుల సంక్షేమం కోసం బడుగు బలహీన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం వివిధ సామాజిక ఉద్య మాల్లో పనిచేస్తూ వస్తున్నానని తెలిపారు. సమాజం లోని అన్ని వర్గాల అభ్యు న్నతి కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగు తుందని జాజాల రమేష్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ధర్మారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్ నర్సింగం ఆధ్వర్యంలో**



ధర్మారం, జూలై 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం లో ధర్మారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతపండు నర్సింగం ఆధ్వర్యం లో ప్రాథమిక పాఠశాల ధర్మారం విద్యార్థుల కు పరిసరాల పరిరక్షణ పై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనైనది. పాఠశాల ఆవరణ లో లయన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యా ర్థుల తో కలసి చెట్లను నాటడం జరిగింది. ఇట్టి కార్య క్రమాల లో డిస్ట్రిక్ట్ మైక్రో క్యాబినెట్ సభ్యులు లయన్ సామ ఎల్లారెడ్డి, కామని శ్రీనివాస్, జోన్ చైర్మెన్ తలమక్కి రవీందర్ శెట్టి, క్లబ్ కార్యదర్శి కట్ట రమేష్, కోశాధికారి కడారి కుమార్, ఎమ్ డి ముజాయిద్ హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మండల పరిషత్ కార్యాలయంలో

## జిపిడిపి పై అవగాహన సదస్సు

**- ఎంపీడీవో దొండ కృపాకర్ అధ్యక్షతన**



ఎండపల్లి, జూలై 18 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండల కేంద్రం లో మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ దొండ కృపాకర్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) ఇతర స్థానిక అభివృద్ధి అంశాలపై మండల స్థాయి అవగాహన సదస్సు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి జిపిడిపి ప్రణాళికలు ఎంతో కీలకమని, ప్రతి గ్రామం లో ప్రజల అవసరాలకు అను గుణంగా పారదర్శకంగా ప్రణాళికలు రూపొందించా లని సూచించారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల సద్వినియోగం, పారి శుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించిన ఈ సమావేశం లో మండలంలోని సర్పంచులు, మండల స్థాయి అధికారులు డాక్టర్ లవ కుమార్, మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ సాయి, ఎంఈఓ సముద్రాల హరికృష్ణ, ఎలక్ట్రిసిటీ ఏఈ బండి సమ్మయ్య, పశు వైద్యాధికారి డాక్టర్ బూర మనోజ్ కుమార్, ఏఎంసీ తులసి మాత, ఐసిడిఎస్ అండాలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తగ్గిన కోర్టు భారం..గెలిచిన సామరస్యం

**- 20 కేసులు రూ. 45.60 లక్షల చెక్ బౌన్స్ వివాదాలకు పరిష్కారం**

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల**

పెద్దపల్లి,జూలై 18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు,జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కక్షిదారులకు ఎంతో ఊరటనిచ్చింది.ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల వెల్లడించారు.శనివారం జరిగిన ఈ ప్రక్రియలో సుమారు రూ. 67.57 లక్షల విలువైన వివాదాలకు సంబంధించి,ఇరువర్గాల అంగీకారంతో రూ. 45,60,420 ల మేర రాజీ మార్గంలో పరిష్కారం చూపినట్లు ఆమె పేర్కొన్నారు.గోదావరిఖని కోర్టులో 8,సుల్తానాబాద్‌లో 5,మంథని మరియు పెద్దపల్లి కోర్టులలో తలా 3 చొప్పున, నందిమేడారం కోర్టులో ఒక కేసు కలిపి మొత్తం 20 కేసులు పరిష్కారం అయ్యాయని ఆమె వివరించారు.కోర్టుల బయట సామరస్యంగా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం,ధనం ఆదా అవ్వడమే కాకుండా,ఇరువర్గాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.కక్షిదారులు భవిష్యత్తులోనూ ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.



ప్రజా కలం

ఆదివారం, జూలై 19, 2026

# ఇస్రోలో ఏం జరుగుతోంది

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఆర్వో) ఇటీవలి నెలల్లో తన అనుభవజ్ఞులైన సైంటిస్టులను కోల్పోతోంది. ఈ పరిణామం దేశంలోని అత్యంత ముఖ్యమైన అంతరిక్ష కార్యక్రమాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీనిని అడ్డుకోవడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీవోఎస్) తక్షణ చర్యలు తీసుకుంటోంది.కొన్ని నెలలుగా ఐఎస్ఆర్వో నుంచి 100 నుంచి 120 మంది సైంటిస్టులు రాజీనామా చేశారు. ఇందులో అనుభవం, నైపుణ్యం ఉన్న వారు కూడా ఉన్నారు. వంద మందికిపైగా సైంటిస్టులు ఇస్రోను వీడడం మామూలు విషయం కాదు. సంస్థలో ప్రతీ సైంటిస్టు పని అనుభవం, జ్ఞానం అనేది సంస్థకు ఒక ఆస్తి. వంద మందికిపైగా సంస్థను వీడడం మిషన్ల నాణ్యత, టైమ్‌లైన్లపై నేరుగా ప్రభావం చూపుతుంది.భారతదేశం మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)వంటి చారిత్రాత్మక మిషన్లను చేపట్టింది. ఇలాంటి ప్రాజెక్టులలో పనిచేసే సైంటిస్టులు రాజీనామా లేదా వాలంటరీ రిటైర్‌మెంట్ కోరినప్పుడు, వాటిని వెంటనే ఆమోదించవద్దని ఇస్రో కేంద్రాలకు డీవోఎస్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదులుగా, అలాంటి అభ్యర్థనలను డీవోఎస్‌కు పంపి, అక్కడి నుంచి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇది సాధారణ ఆదేశం కాదు. కీలక మిషన్లలో పనిచేసే నిపుణులను త్వరగా కోల్పోకుండా రక్షించేందుకు తీసుకున్న జాగ్రత్త చర్య.డీవోఎస్ జోక్యం చేసుకోవడం రెండు విషయాలను స్పష్టం చేస్తోంది. ఒకటి ఇస్రోలోని అనుభవజ్ఞులైన సైంటిస్టులను నిలుపుకోవడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకుంది. రెండోది సంస్థలోని మానవ వనరుల నిర్వహణను కేంద్రీకృతం చేయాలనుకుంటోంది. ప్రతి రాజీనామా అభ్యర్థనను వ్యక్తిగతంగా పరిశీలించి, సంస్థకు అవసరమైన నైపుణ్యాలను కాపాడుకోవాలన్నది ఈ ఆదేశాల ముఖ్య ఉద్దేశం. ఇది సంస్థలోని పని వాతావరణం, పరిహారం, కెరీర్ అవకాశాల వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.ఇస్రో వంటి సంస్థలో సైంటిస్టుల రాజీనామాలు కేవలం వ్యక్తిగత నిర్ణయాలు మాత్రమే కావు. అవి సంస్థలోని నిర్వహణ, ప్రోత్సాహకాలు, బాహ్య అవకాశాలు వంటి విస్తృత కారణాలను ప్రతిబింబిస్తాయి. అనుభవజ్ఞులైన వారు బయటకు వెళ్లడం వల్ల కొత్తగా వచ్చే వారికి ఆ జ్ఞానాన్ని బదిలీ చేయడం కష్టమవుతుంది. పని ఒత్తిడి తగ్గించడం, మెరుగైన పరిహారం, కెరీర్ వృద్ధి అవకాశాలు, ప్రైవేట్ రంగంతో పోటీపడే విధంగా విధానాలు రూపొందించడం వంటివి ఆలోచించాల్సిన అవసరం ఉంది.ఇస్రో భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు మూలస్తంభం. దాని విజయం సైంటిస్టుల ప్రతిభ, అంకితభావంపై ఆధారపడి ఉంది. డీవోఎస్ ఇచ్చిన ఆదేశాలు ఈ ప్రతిభను రక్షించడానికి తీసుకున్న ముందస్తు చర్యగా కనిపిస్తున్నాయి. అయితే, ఇది కేవలం ఆదేశాలతో మాత్రమే సాధ్యం కాదు. సంస్థలోని వాతావరణం, అవకాశాలను మెరుగుపరచడం ద్వారానే దీర్ఘకాలికంగా ప్రతిభావంతులను నిలుపుకోవచ్చు.ఇస్రో మెమో గురించి అడిగిన ప్రశ్నకు సింగ్ సమాధానమిస్తూ.. అది కేవలం పరిపాలనా కారణాలతోనే జరిగిందని చెప్పారు. "లేదు, అది ఎందుకంటే... మరింత పరిణతి చెందిన స్థాయిలో నిర్ణయం తీసుకునేందుకు వీలుగా పరిపాలనా కారణాల వల్ల అలా చేశాం" అని కేంద్ర మంత్రి అన్నారు. ఇస్రోలో చాలా మంది ఉద్యోగులు ఉన్నారని, కొందరు వెళ్లిపోతుంటే మరికొందరు కొత్తగా చేరుతుంటారని ఆయన అన్నారు. "చాలా మంది వెళ్లారు, చాలా మంది వచ్చారు" అని చెబుతూ ఈ విషయంలో ఎలాంటి వివాదం లేదని ఆయన స్పష్టం చేశారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రంలో ఏమీ జరగనప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు.ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ చైన్నైకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ అగ్నికుల్ కాస్మోస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అబ్జర్వర్‌గా చేరారు. జనవరి 2025 వరకు ఇస్రో ఛైర్మన్‌గా కొనసాగిన కాలంలోనే జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్, భారత్ తొలిసారిగా సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య- ఎల్1 వంటి పలు చారిత్రాత్మక మిషన్లు చేపట్టారు.ఇక, భారత భవిష్యత్తు అంతరిక్ష మిషన్లపై అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బదులిస్తూ.. గతంలో ఇస్రో మాజీ చీఫ్ సోమనాథ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. "దాదాపు పదేళ్ల కిందట జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంతరిక్షంలోకి ఒక మనిషిని పంపడం సులభమే కానీ, తిరిగి సురక్షితంగా తీసుకురావడం కూడా అంతే కష్టంతో కూడుకున్న పని అని చెప్పారు.. ఆ విధంగానే క్రూ మాడ్యూల్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పుడు సోమనాథ్ ఆ పదవిలో లేనంత మాత్రాన గగన్‌యాన్ మిషన్ ఆగిపోయిందని అర్థం కాదు. అలా జరగదు కూడా. పైగా ఇస్రోలో పనులు నిరంతరాయంగా సాగుతాయి. పదవీవిరమణ చేసినవారు, మాజీ శాస్త్రవేత్తలు ఈ ప్రాజెక్టులలో భాగస్వాములుగా కొనసాగుతారు. అక్కడ పని సంస్కృతి చాలా భిన్నంగా ఉంటుంది" అని జితేంద్ర సింగ్ అన్నారు.యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ , విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వంటి ఇస్రో కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సోమవారం జారీ చేసిన అంతర్గత మెమోలో కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్రతిష్టాత్మక మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్', ఇతర ముఖ్యమైన మిషన్లతో ముడిపడి ఉన్న గ్రూప్ 'ఎ' సైంటిఫిక్, టెక్నికల్ సిబ్బంది రాజీనామాలను లేదా స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలను సాధారణ పద్ధతిలో ఆమోదించవద్దని ఆదేశించింది.

# రోడ్ల దుస్థితిపై బీజేపీ నిరసన



పెద్దపల్లి,జూలై18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జూలపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధిని విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత నిర్లక్ష్య వైఖరిపై బీజేపీ శ్రేణులు నినాదాలు చేస్తూ మండిపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గత మూడు ఎన్నికల్లో ఎమ్మెల్యేలు మారినా జూలపల్లి తలరాత మారలేదని,రోడ్డు వెడల్పు కోసం ఇళ్లను కూల్చివేసి ఏడాది గడిచినా నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజలు దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే పోలీస్ స్టేషన్ చౌరస్తాలో జూపిటర్ స్కూల్ ముందు పన్నెండేళ్లుగా శిథిలమైన రోడ్డుతో ప్రయాణికులు నరకం చూస్తున్నారని,ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి పనులు ప్రారంభించాలని,లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఏఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు మల్లెత్తుల అంజి యాదవ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాటకుల అనిల్,బీజేపీ సీనియర్ నాయకులు కొమ్మ ఐలయ్య,కనపర్తి రాజేందర్,కంచి శ్రీనివాస్,ఇతర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం

## - నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 18 (ప్రజా కలం) విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపునిచ్చింది. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావంగా శనివారం విద్యుత్ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకానున్నారు. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ మెట్‌పల్లి కార్యవర్గం ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. విద్యుత్ సంస్థలను పరిరక్షించడం, ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రతను కాపాడుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొంది. ఒక్క ఉద్యోగి కూడా మినహాయింపు లేకుండా నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు."ప్రైవేటీకరణ వద్దు- ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం", "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి" వంటి నినాదాలతో శాంతియుతంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా విద్యుత్ జేఏసీ చైర్మన్ ఎండి. అజీజ్, మెట్‌పల్లి డివిజన్ జేఏసీ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, కార్యదర్శి జరుపుల హరిప్రసాద్, జేఏసీ నాయకులు లక్కంపెల్లి సురేశ్, సామల్ల రవి, పిపోజి రవి, కొత్తూరి శంకర్, కరీం, రంజిత్, లక్ష్మి, రమేశ్, బోయిన్పల్లి అశోక్ అరవింద్, జిందం ప్రసాద్ తదితరులు ఉద్యోగులందరూ ఐక్యంగా ఈ నిరసనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళలు హక్కులను తెలుసుకోవాలి




మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 18 (ప్రజా కలం) పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళలు, బాలికల హక్కుల పై షి టీమ్, మహిళా సాధికారిత, సఖి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ ప్రతినిధి పూజిత విద్యార్థినులు, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, వేధింపులపై ఫిర్యాదు చేసే విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.మహిళా సాధికారిత ప్రతినిధి స్వప్న మహిళల హక్కులు, బాలికల విద్య ప్రాధాన్యత, ఆత్మవిశ్వాసం, స్వయం సాధికారత, లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. సఖి ప్రతినిధి శారద మహిళలకు అందుబాటులో ఉన్న సహాయ సేవలు, చట్టపరమైన రక్షణ, అత్యవసర సహాయ కేంద్రాల సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని అన్నారు. బాలికల భద్రత, విద్య, సాధికారత ప్రతి కుటుంబం బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీలి నాలుక వ్యాధి నివారణకు గొర్రెలకు టీకాలు



పెద్దపల్లి,జూలై 18 (ప్రజాకలం జిల్లాప్రతినిధి) వానాకాలంలో గొర్రెలకు సోకే ప్రమాదకరమైన నీలి నాలుక వ్యాధి నివారణపై జూలపల్లి మండల పశుసంవర్ధక శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గొర్రెలకు పశు వైద్యాధికారి డాక్టర్ అభిలాష్ రెడ్డి ఉచిత టీకాల వేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే ఈ వ్యాధి పట్ల పెంపకదారులు అప్రమత్తంగా ఉండాలని,గొర్రెల పెంపక కేంద్రాల వద్ద నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఆగస్టు 8 వరకు కొనసాగే ఈ ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అనంతరం ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం వైస్ చైర్మన్ కోరే శ్రీనివాస్ మాట్లాడుతూ జీవాల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని పెంపకదారులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బండారి రమేష్,మల్లెతుల కనుకయ్యలతో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది పంపర శంకర్,మల్లేశం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి : ఎంపీడివో గణేష్

ఇబ్రహీంపట్నం జూలై 18( ప్రజా కలం ప్రతినిధి) మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు మరియు క్షేత్ర సహాయకులచే సమీక్ష సమావేశము నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రధానంగా చర్చించిన అంశములు ఒకటి జలసిరి సంబంధించి నా పనులు గుర్తించడం ఒకటి వ్యక్తిగత ఇంకుడు గుంతలు రెండు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు మూడు ఫారం పాండ్స్ నాలుగు ఊట కుంటలు ఐదు బోర్వెల్ రీఛార్జి పనులు ఆరు గ్రూప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చరీ పనులు గుర్తించి పనులు వేగవంతం చేయాలని చెప్పడం జరిగింది అదేవిధంగా ఇందిరమ్మ హౌసింగ్ సంబంధించిన పనులు వేగవంతం చేయాలని మరియు వివో బిల్డింగ్స్ పనుల వద్ద టాయిలెట్ నిర్మాణం చేపట్టుటకు తీర్మానములు సమర్పించాలని అదేవిధంగా అంగన్వాడీ బిల్డింగ్స్ దగ్గర టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని వీటికి సంబంధించిన తీర్మాణములు సమర్పించాలని తెలియజేయడం జరిగింది అదేవిధంగా ఈ సంవత్సరం వనమహోత్సవం సంబంధించిన టార్గెట్ ఈ వారం రోజు లోపల ఫిట్టింగ్ ప్లాంటింగ్ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఎంపీఓ అంబటి వెంకట రామకృష్ణా రాజు ఏపీఓ కొమురయ్య. పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర సహాయకులు పాల్గొనడం జరిగింది.

# వాసవి పాఠశాలలో పసుపు వర్ణ శోభితం

## - ఘనంగా వరల్డ్ ఎమోజి డే-యెల్లో డే వేడుకలు




పెద్దపల్లి,జూలై18:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లిలోని వాసవి పాఠశాల ప్రాంగణం నేడు పసుపు వర్ణంతో తళతళలాడింది.వరల్డ్ ఎమోజీ డే మరియు యెల్లో డే వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు జరుపుకున్న సంబరాలు ఆకట్టుకున్నాయి.చిన్నారులందరూ పసుపు రంగు దుస్తుల్లో మెరిసిపోతూ,తమ చేతుల్లో పసుపు రంగు పండ్లు,వస్తువులను ధరించి పాఠశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పసుపు రంగు ఆనందం,ఉత్సాహం,ఆశావాదం,సానుకూలతకు చిహ్నమని విద్యార్థులకు వివరించారు.డిజిటల్ ప్రపంచంలో ఎమోజీల ప్రాముఖ్యతను,అవి మనుషుల భావోద్వేగాలను ఎంత సులభంగా తెలియజేస్తాయో విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాసవి స్కూల్ చైర్మన్ పాంపాటి శ్రీకాంత్, ప్రిన్సిపాల్ మానస పాఠశాల నిర్వహించిన సృజనాత్మక కార్యక్రమాలను అభినందించారు.విద్యార్థుల ఉత్సాహం చూస్తుంటే ఎంతో ముచ్చటేస్తోందని పేర్కొంటూ,ఉపాధ్యాయులు కృష్ణవేణి, సౌమ్య,సమ్రీన్,అంజలి,ప్రిన్సీ,నోరిన్ తదితరులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# జనం ప్రాణాలతో వ్యాపారం

## - గోదావరిఖనిలో బయటపడ్డ కల్తీ చిప్స్ తయారీ కేంద్రం



పెద్దపల్లి,జూలై 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని రాజీవ్ నగర్‌లో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో, వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఒక ఆహార తయారీ యూనిట్ గుట్టు రట్టయింది.ఆలుగడ్డ చిప్స్,స్నాక్స్ తయారీలో నిబంధనలకు విరుద్ధంగా పదేపదే వేడి చేసిన వంటనూనెను వినియోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు,టెస్టింగ్ మీటర్ ద్వారా నాణ్యతను పరీక్షించగా అది ప్రమాదకర స్థాయికి చేరుకున్నట్లు నిర్ధారించుకున్నారు.వెంటనే స్పందించిన ఫుడ్ సేఫ్టీ అధికారి వి.అంకిత్ రెడ్డి నేతృత్వంలోని బృందం,సుమారు 25 కిలోల నాణ్యత లేని వంటనూనెను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడమే కాకుండా,సదరు నూనెతో తయారు చేసిన నిల్వలను కూడా అక్కడికక్కడే ధ్వంసం చేశారు.వాడిన వంటనూనెను అనధికార వ్యక్తులకు విక్రయించవద్దని యాజమాన్యానికి కఠినంగా హెచ్చరించిన అధికారులు,సేకరించిన నమూనాలను రాష్ట్ర ప్రయోగశాలకు పంపారు.ల్యాబ్ నివేదికల ఆధారంగా సంబంధిత యాజమాన్యంపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

# దళితులకు రక్షణ కల్పించండి

## - ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఆల్ సంఘాల ఐక్యవేదిక విన్నపం



పెద్దపల్లి,జూన్ 18:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)పెద్దపల్లి జిల్లాలో దళితులపై పెరుగుతున్న దాడులు,భూకబ్జాలు,సామాజిక వివక్ష, అధికారుల నిర్లక్ష్యంపై ఆల్ సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాటకుల మహేష్ నాయకత్వంలో బాధితులు మరియు సంఘాల ముఖ్య నాయకులు శనివారం పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి,సమగ్ర వినతి పత్రంతో పాటు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అన్యాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.జిల్లాలో చోటుచేసుకుంటున్న ఆలయ ప్రవేశ నిషేధాలు,కుల బహిష్కరణలు,భూ సమస్యలు, దళితులపై జరుగుతున్న హత్యల వంటి తీవ్రమైన అంశాల పట్ల స్థానిక పోలీస్‌యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని,దీనివల్ల బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.బాధితుల తరపున వాదనలు వినిపిస్తూ,వెంటనే ఈ సమస్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కమిషన్ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష లకు వినతి పత్రం అందజేసి కోరారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,ఆది జాంబవంతు అరుంధతి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి పాపయ్య,మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మి,గుల్ల రాజు,కవ్వంపల్లి దుర్గయ్య, బొంకూరి సుభాష్,సలగంటి రామలక్ష్మి, ఉండింటి ప్రభాకర్,రామిల్ల శారద,బోసేల్లి మహేష్,కృష్ణ,వీరయ్య, శంకరయ్య,మల్లేశం,బోధలు,మదెల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



( వరంగల్/ పర్వతగిరి) జులై 18, ప్రజాకలం ప్రతినిధి.

ప్రతినెల మూడవ శనివారం జరిగే తల్లిదండ్రుల సమావేశం, నో బాక్స్ డే ను జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతినెల పిటీఎంలకు హాజరుకావాలని వాగ్దానం చేయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తల్లిదండ్రులు సహకరించినట్లయితే విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేసి పాఠశాలను అభివృద్ధి పథంలోకి పయనింప చేస్తామని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి దాదాపు 40 మంది తల్లిదండ్రులు హాజరు కాగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు, కే. శ్రీధర్, టి. శాంతి కిరణ్, వర్కాల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## వలలో చిక్కుకున్న కుకేడు పాము..
### అటవీశాఖకు అప్పగించిన ఇంటి యజమాని




( వరంగల్/పర్వతగిరి)జూలై 18, ప్రజాకలం ప్రతినిధి. మండల కేంద్రానికి చెందిన ఏటూరి తిర్మల్ రావు ఇంటి ఆవరణలో శనివారం ఉదయం కుకేడు పాము వలలో చిక్కుకుని కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. తిర్మల్ రావు తన ఇంటి ఆవరణలో పెరటి, ఔషధ మొక్కలను పెంచుకుంటున్నారు. కోతుల బెడద నుంచి మొక్కలను రక్షించేందుకు వాటి చుట్టూ రక్షణ వల ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం లేచి ఆవరణలోకి వెళ్లి చూడగా ఆ వలలో కుకేడు పాము చిక్కుకుని కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన ఆయన అరుపులు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. స్థానికులు పామును చంపాలని సూచించినప్పటికీ, తిర్మల్ రావు మానవత్వంతో వ్యవహరించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అటవీశాఖ సిబ్బంది పామును సురక్షితంగా వల నుంచి బయటకు తీసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వన్యప్రాణులను చంపకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగించిన తిర్మల్ రావును స్థానికులు అభినందించారు. అటవీశాఖ అధికారులు కూడా అడవి జంతువులు లేదా పాములు కనిపించినప్పుడు వాటిని హాని చేయకుండా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

## విజయవిహారం రమణమూర్తి పై మతోన్మాది చేసిన దాడిని తీవ్రంగా ఖండిద్దాం

### - మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక - శక్తులంతా ఐక్యంగా పోరాడుదాం
### -అలవాల రాజా మాదిగ

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జులై 18:

సమాజంలో ప్రతి రోజూ ఏదో చోట మతం, కులం అనే అంశం పై రాజకీయ నేతల అండ దండలతో కొంత మంది వ్యక్తులు కావాలనే గొడవలను, దాడులకు చేస్తూ గందర గోళం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, సామాజిక ఉద్యమ నాయకులు అలవాల రాజా మాదిగ ఒక ప్రకటనలో అన్నారు. అదే విధంగా భిన్నాభి ప్రాయాలను హింసతోఅ ణచి వేయానే ప్రయత్నం ప్రజాస్వామ్య విలువలపై దాడి గా పరిగణిం చాలని అన్నారు. ఏ వ్యక్తిపైనైనా మతం, భావజాలం లేదా వ్యక్తిగత ద్వేషం పేరుతో జరిగే హింసను సమాజం ఎన్నటికీ అంగీకరించ దనీవిజయవిహారం రమణమూర్తి గారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని, తగిన చర్యలు చేపట్టాలి డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యంలో వాదనలకు సమాధానం వాదనలతోనే ఉండాలనీ; హింసకు,మతోన్మాదానికి, విద్వేష రాజకీయాలకు స్థానం లేదనీ. శాంతి, సామరస్యం, రాజ్యాంగ విలువలు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మతోన్మాదాన్ని తిప్పికొట్టాలని ప్రజాస్వామ్యాన్నీ కాపాడాలని పిలుపు ఇచ్చారు.



## అంబరాన్ని అంటిన అల్ఫోర్స్
# బోనాల సంబరాలు

### - తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించిన వేడుకలు
### - విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ

జూలై 18 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేటలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండుగకు విశిష్టమైన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందన్నారు. ఆషాఢ మాసంలో గ్రామదేవతలైన మహంకాళి, పోచమ్మ, ఎల్లమ్మ తదితర అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

'బోనం' అంటే భోజనమని, వండిన అన్నంలో బెల్లం, పాలు కలిపి మట్టి లేదా ఇత్తడి పాత్రలో నైవేద్యంగా సమర్పించడం ద్వారా అమ్మవారి ఆశీస్సులు పొందుతారని వివరించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించే సంప్రదాయాన్ని గుర్తుచేస్తూ, మహిళలు తలపై బోనాలు మోసుకుంటూ, చేతుల్లో వేపాకులు ధరించి, డప్పు వాయిద్యాలు, పోతరాజు విన్యాసాల నడుమ ఆలయాలకు వెళ్లడం బోనాల ప్రత్యేకత అని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో ఒకప్పుడు కలరా మహమ్మారి విజృంభించిన



సమయంలో అమ్మవారిని ప్రార్థించి బోనాలు సమర్పించడంతో వ్యాధి తగ్గిందనే విశ్వాసంతో ఈ ఉత్సవాలు మరింత ప్రాచుర్యం పొందాయని చెప్పారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

వేడుకల్లో భాగంగా ప్రాంగణాన్ని సంప్రదాయ శైలిలో సుందరంగా అలంకరించారు. విద్యార్థులు నిర్వహించిన బోనాల వేషధారణలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ నరేందర్ రెడ్డి బహుమతులు అందజేసి అభినందించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు మరో అవకాశం

### దోస్త్ అదనపు దశకు నేటి నుంచి శ్రీకారం
### జూలై 26 వరకు రిజిస్ట్రేషన్ - 27 వరకు వెబ్ ఆప్షన్లు
### -ప్రభుత్వ డిగ్రీ కళాశాల వర్ధన్నపేటలో ఇంకా అందుబాటులో సీట్లు

జూలై 18 ప్రజాకలం ప్రతినిధి:( వరంగల్ /వర్ధన్నపేట) ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణ విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి సువర్ణావకాశాన్ని కల్పించింది. డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ (దోస్త్ ) ప్రక్రియలో అదనపు దశ (అడిషనల్ ఫేజ్ ) సోమవారం జూలై 20, 2026 నుంచి ప్రారంభమై జూలై 26 వరకు కొనసాగనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వర్ధన్నపేట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోషయ్య తెలిపారు. విద్యార్థులు నిర్ణీత గడువులోగా దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, జూలై 27 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇప్పటికే అధిక సంఖ్యలో విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందినప్పటికీ, జనరల్ మరియు కంప్యూటర్ కాంబినేషన్‌లతో కూడిన కొన్ని గ్రూపుల్లో ఇంకా సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, విశాలమైన తరగతి గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న వివిధ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన విద్యార్థులు పొందవచ్చని పేర్కొన్నారు.

దోస్త్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి విద్యార్థులు నేరుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వర్ధన్నపేటను సంప్రదించాలని, అవసరమైన మార్గదర్శకత్వాన్ని కళాశాల అధ్యాపకులు అందిస్తారని ప్రొఫెసర్ జి. పోషయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంకా డిగ్రీలో చేరని విద్యార్థులందరూ ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎల్-నినో ఎఫెక్ట్‌తో అప్రమత్తం కావాలి

### - ప్రత్యామ్నాయ పంటలే రైతుకు రక్షణ
### - దమ్మన్నపేట రైతు వేదికలో వ్యవసాయ శాఖ అవగాహన సమావేశం
### - వరి సాగు తగ్గించి చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుపై అధికారులు సూచనలు

జూలై 18 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట)

ఎల్–నినో ప్రభావంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట రైతు వేదికలో శనివారం నిర్వహించిన ఎల్–నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు ఖరీఫ్–2026 ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై అవగాహన సమావేశంలో రైతులకు పలు కీలక సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ), వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ), ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం, తగ్గుతున్న వర్షపాతం, పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం జూన్ నెలలో సాధారణంగా 115.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా ఈసారి 93.6 మిల్లీమీటర్లు మాత్రమే కురిసి 18.7 శాతం లోటు నమోదైంది. అలాగే జూలై నెలలో ఇప్పటివరకు సాధారణ 191.7 మిల్లీమీటర్లకు బదులుగా కేవలం 66.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై 65.3 శాతం లోటు ఉన్నట్లు తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే నీటి అవసరం అధికంగా ఉండే పంటలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రైతులు వరి సాగును పూర్తిగా నివారించడం లేదా సాధ్యమైనంత వరకు తగ్గించడం ఉత్తమమని సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉ



ండే, కరవును తట్టుకునే ఉలువలు, సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, ఉదలు, మినుములు, కందులు, అలసందలు వంటి చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని కోరారు.అదేవిధంగా భూమిలో తేమను నిల్వ ఉంచే పద్ధతులు, వర్షపు నీటి సంరక్షణ, నాణ్యమైన విత్తనాల వినియోగం, శాస్త్రీయ సాగు విధానాల అమలు, వ్యవసాయ శాఖ రూపొందించిన ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళికను పాటించడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లో కూడా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని అధికారులు వివరించారు.రైతులు వాతావరణ శాఖ విడుదల చేసే సూచనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటల ఎంపిక చేసుకోవాలని కోరారు. సమావేశంలో రైతులు పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోగా, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేసుకుంటేనే రైతులు నష్టాలను అధిగమించి లాభదాయకమైన సాగును కొనసాగించగలరని అధికారులు స్పష్టం చేశారు.

## వర్ధన్నపేటలో ఎక్సైజ్ శాఖ స్వాధీనం చేసుకున్న వాహనాల బహిరంగ వేలం

### – జూలై 20న ఉదయం 10 గంటలకు నిర్వహణ
### – ప్రభుత్వ నిబంధనల మేరకు 50 శాతం డిపాజిట్‌తో పాల్గొనే అవకాశం

జూలై 18 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, వర్ధన్నపేట పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడి శాఖ ఆధీనంలో ఉన్న వాహనాలను ఈ నెల 20వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. ఈ వేలంపాట జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, వరంగల్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.వేలంపాటలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం వాహనం నిర్ణీత విలువలో 50 శాతం మొత్తాన్ని ముందస్తు డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అత్యధిక ధరను కోట్ చేసిన వారికి సంబంధిత నిబంధనల మేరకు వాహనాలు,కేటాయించబడతాయని పేర్కొన్నారు.వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఆసక్తి గల వ్యక్తులు నిర్ణీత సమయానికి అవసరమైన పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సూచించారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం వర్ధన్నపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని అధికారులు కోరారు.

## అకాల విపత్తులపై అప్రమత్తతే ప్రాణరక్షణ

### వర్ధన్నపేటలో ఎన్‌డీఆర్ఎఫ్ కమ్యూనిటీ అవగాహన
### ప్రత్యక్ష ప్రదర్శనలతో ప్రజలకు శిక్షణ
### పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి



జూలై 18 ప్రజాకలం ప్రతినిధి: ( వరంగల్ /వర్ధన్నపేట)

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి సమయోచితంగా స్పందిస్తే ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విజయవాడ 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ నిర్వహించిన కమ్యూనిటీ అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సమయంలో తమను తాము, ఇతరులను ఎలా రక్షించుకోవాలి, అత్యవసర సహాయక చర్యలను ఎలా చేపట్టాలనే అంశాలపై ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు సంభవిస్తాయో చెప్పలేమని, అందువల్ల ప్రతి ఒక్కరూ విపత్తు నిర్వహణపై అవగాహనతో పాటు శిక్షణ కూడా పొందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు విపత్తుల సమయంలో అప్రమత్తత, సమయస్ఫూర్తి, ప్రాథమిక చికిత్స (ఫస్ట్ ఎయిడ్), సురక్షిత తరలింపు విధానాలు, సహాయక చర్యలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు పలు సందేహాలను నివృత్తి చేసుకుని ఆసక్తిగా శిక్షణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కమ్మం కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ బాబూలాల్, ఫైర్ అధికారి జయపాల్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, ఫైర్ శాఖ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణ మిత్రుడి కుటుంబానికి రూ.1.50 లక్షల విరాళం

### స్నేహానికి నిలువెత్తు నిదర్శనం
### భాస్కర్ కుటుంబానికి తోడుగా నిలిచిన ట్రిబుల్ ఐటీ మిత్రులు
### న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా
### ఉప్పరపెల్లిలో భావోద్వేగ వాతావరణం



జులై 18 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) స్నేహం అంటే కష్టకాలంలో అండగా నిలబడటమేనని వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపెల్లి గ్రామంలో ట్రిబుల్ ఐటీ కళాశాల మాజీ విద్యార్థులు మరోసారి చాటిచెప్పారు. తమ ప్రాణ మిత్రుడు సీనపెల్లి భాస్కర్ దూర్మార్గుల దాడి మరణంతో తీవ్ర విషాదంలో మునిగిపోయిన అతని కుటుంబానికి అండగా నిలుస్తూ రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

భాస్కర్ మరణవార్త తెలిసిన నాటి నుంచి తీవ్ర దిగ్భ్రాంతికి గురైన అతని స్నేహితులు, కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు తమ వంతు బాధ్యతగా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. "మిత్రుడిని తిరిగి తీసుకురాలేం... కానీ అతని కుటుంబం ఒంటరిగా భావించకుండా మా జీవితాంతం అండగా ఉంటాం" అని భావోద్వేగంతో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన స్నేహితులు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి దుఃఖంలో తాము భాగస్వాములమని తెలిపారు. భాస్కర్ మరణానికి కారణమైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.స్నేహితుల ఈ గొప్ప మనసును చూసిన గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. నేటి సమాజంలో స్నేహం పేరుకే పరిమితమవుతున్న తరుణంలో, కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచి రూ. 1.50 లక్షల సహాయాన్ని అందించడం నిజమైన స్నేహానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.భాస్కర్ తన ఆప్యాయత, స్నేహశీలతతో అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని, అతని జ్ఞాపకాలు ఎప్పటికీ తమతోనే ఉంటాయని స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటన ఉప్పరపెల్లిలో ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించగా, స్నేహబంధం ఎంత గొప్పదో మరోసారి గుర్తు చేసింది.

## రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మలు తొలగింపు: సర్పంచ్ వినోద్



ప్రజా కలం జులై 18 (గద్వాల ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని ఎల్కూర్ గ్రామ ప్రధాన రహదారిపై శుక్రవారం కురిసిన వర్షానికే ఒక పెద్ద చెట్టు విరిగిపడింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారిపై చెట్టు పడిన విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ వినోద్ కుమార్ తక్షణమే స్పందించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి చెట్టు కొమ్మలను వేగంగా నరికి పక్కకు తొలగించారు. సర్పంచ్ సకాలంలో స్పందించి రహదారిని పునరుద్ధరించడంతో వాహనాదారులు, గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాల శాస్త్రవేత్తలకు ఇన్స్పైర్ ఆహ్వానం

### – జిల్లా సైన్స్ అధికారి శంశీర్..

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 18:

ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ వైజ్ఞానిక ఆలోచనలు సృజనాత్మకతను ప్రోత్సహించి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ప్రధాన లక్ష్యంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇన్స్పైర్ మనక్ పురస్కారాలకు సంబంధించి 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నుంచి ఆన్లైన్లో నామినేషన్లను ఆహ్వానిస్తుంది. ఈ ప్రక్రియ ఈనెల 15న ప్రారంభమైంది నామినేషన్ల సమర్పణకు గడువు తేదీ సెప్టెంబర్ 15.

అర్హులు వీరే... అన్ని యాజమాన్యాలలో ఉన్నత ప్రాథమికొన్నత పాఠశాలలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఐదు ప్రాజెక్టుల ఆలోచనలను విద్యార్థుల నుంచి పంపించాలి. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వినూత్న ఆలోచనలను ఆహ్వానించి ఉత్తమ ఆలోచనలను ఎంపిక చేసి పంపించవచ్చు సంబంధిత వెబ్సైట్ www.inspireawards-dst.gov.inలో వీటిని నమోదు చేయాల్సి ఉంటుంది.

ఐ విజయకుమారి జిల్లా విద్యాశాఖాధికారి మహబూబ్ నగర్

**ప్రాజెక్టుల తయారీకి రూపాయలు 10000 /-**

విద్యార్థుల్లోని వైజ్ఞానిక ప్రతిభను వెలికి తీసినందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా అమలు చేసే ఈ పథకానికి ఎంపికైన విద్యార్థులకు రూపాయలు పదివేల చొప్పున ఆర్థిక సాయం వారి ఖాతాల్లో నేరుగా జమవుతుంది. దీంతో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో పోటీలో నిర్వహిస్తారు జాతీయస్థాయిలోనూ అత్యుత్తమమైన 60 ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు ఒక్కో పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలి.

కొత్త వినూత్న సమస్య పరిష్కార ఎగ్జిబిట్లను రూపొందించాలి.

విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి ప్రయోగాల వైపు మళ్ళించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించాలి అందులో భాగంగానే ఇన్స్పైర్ మనక్ అవార్డులు పొందడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు . కాబట్టి అన్ని ఉన్నత, ప్రాథమికొన్నత పాఠశాలల నుండి తప్పకుండ 5 ప్రాజెక్ట్స్ ను అప్లోడ్ చేయాలి. జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తున్నాం రాష్ట్ర జాతీయస్థాయిలో ఎగ్జిబిట్లను ప్రదర్శించే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది ఈసారి మరికొన్ని కొత్త ఆలోచనలతో ఎగ్జిబిట్లను రూపొందించే ప్రయత్నం చేయాలి – జిల్లా సైన్స్ అధికారి శంశీర్

## మల్దకల్‌లో ఫోర్జరీ కేసు...

## ప్రధాన నిందితుడు అరెస్ట్, రిమాండ్

### - పరారీలో మరో నిందితుడు

ప్రజా కలం జూలై 18 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఎల్కూర్ గ్రామంలో విలువైన రోడ్డు కార్నర్ ఓపెన్ ప్లాట్‌ను అక్రమంగా కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీకి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడు కె. విజయ్ (A-1)ను మల్దకల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు దేవర్ల తిమ్మప్ప (A-2) ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, దేవర్ల తిమ్మప్ప అసలు భూయజమానిని తప్పుదోవ పట్టిస్తూ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.1437/2024లో కావాలనే చతుర్దిశలను మార్చి నకిలీ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఆ పత్రాలను ఆధారంగా చూపిస్తూ కె. విజయ్ సివిల్ కోర్టు నుంచి స్టే ఆర్డర్ పొందినట్లు గుర్తించారు. ఆ స్టే ఆర్డర్‌ను ఆధారంగా చేసుకుని బాధితుడు తెలుగు నర్సింహులు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి, పనులను అడ్డుకోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్దకల్ పోలీసులు రెవెన్యూ శాఖ, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులను పరిశీలించి ఫోర్జరీ జరిగినట్లు నిర్ధారించారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 338, 336(3), 340, 329(3), 318(4) r/w 3(5) కింద కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు కె. విజయ్‌ను రిమాండ్‌కు పంపించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు దేవర్ల తిమ్మప్పను త్వరలోనే అరెస్ట్ చేస్తామని మల్దకల్ ఎస్ఐ కె. శ్రీహరి తెలిపారు.

## కన్నాయిగూడెంలో స్వచంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం

### - హాజరైన కూటమి నాయకులు



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక జూలై 18 పోలవరం జిల్లా, ఎటపాక మండలం,కన్నాయిగూడెం పంచాయతీ కన్నాయిగూడెము గ్రామంలో స్వచంద్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం కూటమి నాయకులు మరియు పంచాయతీ సెక్రటరీ సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం జరుగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా, చిరు వ్యాపారాలు చేసే షాప్ యజమానులకు ఒక పద్ధతి ప్రకారం చెత్తను నిల్వ చేయాలని,అందులో తడి పొడి చెత్తలను వేరు వేరు నిల్వ చేయాలని ఇంట్లో వ్యర్థాలను సేకరించేందుకు వాహనాలను ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. అలాగే రాష్ట్రములో 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించడం కూటమి ప్రభుత్వం యొక్క ఉద్దేశం అనీ ఈ సందర్బంగా కూటమి నాయకులు తెలియజేసారు. అనంతరం గ్రామంలో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమం లో జనసేన నాయకులు కొమ్ము వెంకటేష్, పంచాయతీ తంత్రపల్లి సత్యనారాయణ,కందుల గోపాలు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు వీరభద్రం, సూరిశెట్టి సత్యనారాయణ, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు

## శవ పేటిక డొనేట్



పాలేరు జులై 18(ప్రజా కలం న్యూస్ )

తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన అమరుడు సోమనపల్లి లింగయ్య. పెద్ద భార్య నాగమ్మ, జ్ఞాపకార్థంగా చిన్న భార్య సోమనపల్లి సూరమ్మ. కుమారుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు( సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ ( ప్రజా పంథా) తిరుమలాయపాలెం మండల కార్యదర్శి) కుటుంబ సభ్యులు చర్చించుకుని దమ్మాయిగూడెం గ్రామంలో పేద ప్రజలు ఆర్థిక భారంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని కుటుంబంలో ఒక సభ్యుడు మరణిస్తే శవాన్ని భద్రపరచడానికి ఎలాంటి రక్షణ లేకుండా ఇబ్బంది పడుతున్నారని అర్థం చేసుకున్న భార్య సూరమ్మ కుమారు వెంకటేశ్వర్లు దమ్మాయిగూడెం గ్రామానికి శవపేటికని (డొనేట్) శనివారం గ్రామపంచాయతీ సర్పంచి మరియు కార్యదర్శి కి వితరణ చేయడం జరిగినది.

గ్రామంలో ఎవరు మరణించిన ఉచితంగా శవపేటిక ( పిజ్జార్ బాక్స్) ఇవ్వాలని కుటుంబా నిర్ణయాన్ని గ్రామ ప్రజలు. దమ్మాయిగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం సూరమ్మ వెంకటేశ్వర్లను అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద . ఉప సర్పంచ్ రాజశేఖర్ కోరారు. ప్రతి ఒక్కరూ సోమనపల్లి వెంకటేశ్వర్లు నీ ఆదర్శంగా తీసుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అమరుడు సోమనపల్లి లింగయ్య, జీవిత భాగస్వామి సోమనపల్లి సూరమ్మ. కుమారుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు. బిడ్డలు అల్లుళ్ళు మాడుగుల వెంకన్న కుసుమ. అనంతగిరి వెంకన్న పద్మ. గట్టు ఎల్లయ్య సుశీల. సర్పంచి వీరదాసు వినోద బద్రి. ఉప సర్పంచ్ ఉన్నాం రాజశేఖర్. దమ్మాయిగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్. వార్డ్ మెంబర్ సేకినాబి. చామకూరి ప్రమీల. రమణ బోయిన నరసయ్య.సాయిబాబా. మాజీ సర్పంచ్ కూసు అప్పారావు. ఆలస్యం నాగేశ్వరరావు. సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్( ప్రజాపంథా) జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు. ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ మండల అధ్యక్షుడు ఉన్నం నరేష్. కూసు ప్రసాద్ . లాలయ్య.జగదీష్. ఉన్నావ్ నాగేశ్వరరావు. వీరదాస్ బద్రి. వీరదాస్ వెంకన్న. తదితరులు

## ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### - జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న




నిర్మల్ జూలై 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఉపాధ్యాయులు నేటితరం విద్యార్థులకు అనుగుణంగా విద్యా బోధన జరపడానికి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి అని డీఈఓ అన్నారు. స్థానిక నారాయణ పాఠశాలలో జరుగుతున్న సాంఘికశాస్త్రము మరియు జీవశాస్త్రం ఉపాధ్యాయుల శిక్షణశిబిరాన్ని శనివారం సందర్శించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనల మెలకువలను చక్కగా నేర్చుకోవాలని విద్యార్థులకు వారి స్థాయికి అనుగుణంగా నేర్పాలని సమాజంలో మంచి పౌరులుగా తయారయ్యేందుకు తీర్చిదిద్దాలని ప్రయోజకులుగా తయారు చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఒ.నరసయ్య, కోర్స్ డైరెక్టర్లు రామచందర్, శ్రీనివాస రెడ్డి, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు

## మాట ఇచ్చినాం.. ఖచ్చితంగా అమలు చేస్తాం

### – ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 18:

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు పాత పద్ధతిలోనే పెన్షన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యే గారిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే సంకల్పం ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొంత వెసులుబాటు వచ్చిన తరువాత ఉద్యోగులకు పదవీవిరమణ అనంతరం పాత విధానంలోనే పెన్షన్ అమలు జరిగే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని, అలాగే సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలతో చర్చించి ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, నాయకులు చంద్ర నాయక్, మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి**

**వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రణాళిక రూపొందించాలి**

**అంజనాపురంలో ముఖ్యమంత్రి పర్యటన సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం, జూలై -18( ప్రజా కలం న్యూస్ )

గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

వైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లు సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. సభా వేదికను సుమారు 100 మంది బరువును తట్టుకునే విధంగా నిర్మించాలని, అయితే ప్రోటోకాల్ ప్రకారం డయాస్‌పై సీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే సిద్ధం చేసి, ప్రతి శాఖ అదే ప్రకారం బాధ్యతలు నిర్వహించేలా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు శాఖ అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వాహనాలు, వీఐపీ వాహనాలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గోద్రెజ్ సంస్థ తరపున కార్యక్రమంలో ప్రసంగించే ప్రతినిధి వివరాలను ముందు గానే ఖరారు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆడియో, వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వీడియోతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను కార్యక్రమంలో ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు హాజరయ్యేవారందరికీ స్పష్టంగా కనిపించేలా అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యతను ఆహార తనిఖీ అధికారి స్వయంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. కార్యక్రమానికి అవసరమైన సురక్షిత త్రాగునీటిని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు.

ప్రోటోకాల్‌కు అనుగుణంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగినంత ఇంధనంతో స్టాండ్‌బై జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో రూ. 98 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

### – విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

తానూర్, జులై 18(ప్రజా కలం): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో నాబార్డ్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు, నాబార్డ్ నిధుల నుంచి రూ, 56 లక్షల



వ్యయంతో పాఠశాల మొదటి అంతస్తులో నిర్మించిన అదనపు తరగతి గదులను, అలాగే రూ,42.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు మౌలిక సదుపాయాలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, అనంతరం విద్యార్థినులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన మెరుగైన విద్యా వాతావరణాన్ని, వసతులను కల్పించేందుకే ప్రభుత్వం ఈ నిధులను కేటాయించిందని, ఈ అభివృద్ధి పనులు వారి ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, స్థానిక సర్పంచ్ సుగంధ – మాధవరావు పటేల్, పాఠశాల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు,ఉపాధ్యాయలు,విద్యార్థినులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులు, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఈ నెల 20న మంత్రి జూపల్లి సమీక్ష**

**నాలుగు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఉట్నూరులో సమావేశం**

నిర్మల్, జులై 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు

పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, మద్యనిషేధం ఓ ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 20న ఉట్నూరులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేయనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే సమీక్షలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, శాఖల సమన్వయం, అత్యవసర కార్యాచరణపై సమగ్రంగా చర్చించనున్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, మార్క్‌ఫెడ్, సాగునీటి శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ (టీజీఎన్‌పీడీసీఎల్), అటవీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య, మహిళా–శిశు సంక్షేమ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని తమ శాఖల సన్నద్ధతపై వివరాలు సమర్పించనున్నారు.

## విద్యా భారతి పాఠశాల లో ఆషాడ మాసం గోరింటాకు పండగ





నిర్మల్ , జులై 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి); కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో శనివారం ఆషాడ మాసం గోరింటాకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిలకు గోరింటాకు పెట్టి సందడి చేశారు. మన వాతావరణం ప్రకారం ఆషాడంలో వర్షాలు పడడంతో వాతావరణం చల్లగా మారుతుంది అన్నారు. కాబట్టి సూక్ష్మ క్రిములు చేతులకు అంటుకొని అంటు రోగాలు వ్యాపించే క్రమంలో గోరింటాకు పెట్టుకుంటే అంటు రోగాలు దరి చేరవని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురం శెట్టి లింగయ్య, ఉపాధ్యాయులు పోతన్న, మధుసూదన్, ప్రవీణ్ కుమార్, రాజు,దేవకి, శ్రీవిద్య, కవిత,రాణి, సరోజన, గంగామణి, సరస్వతి, శృతిక, నేహ, పద్మ, గంగ వేణి, లక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

### ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి
## దాతల సహకారం ఎంతో అవసరం:
### ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



ప్రజా కలం జూలై 18 (గద్వాల ప్రతినిధి)
ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు సమాజంలోని దాతలు అందించే తోడ్పాటు ఎంతో అభినందనీయమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కొనియాడారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కోసం ఉచితంగా వాటర్ ఫిల్టర్ మరియు డిజిటల్ క్లాస్ రూమ్ సౌకర్యాలను కల్పించేందుకు ముందుకు వచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త, సీనియర్ నాయకులు బండ రాజశేఖర్ రెడ్డిని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని నేడు ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దానికి దాతల భాగస్వామ్యం కూడా తోడైతే పాఠశాలలో మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పెద్ద మనసుతో విరాళం ప్రకటించిన బండ రాజశేఖర్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, జిల్లా విద్యాధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు శాఖలవారీ గా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి:
### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 18 :
ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు నిర్దిష్టమైన కంటింజెన్సీ (అత్యవసర) కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి, పూర్తి వివరాలతో ప్రజెంటేషన్‌కు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, విద్యుత్, విద్య, వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ తదితర శాఖలు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చేపడుతున్న చర్యలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను ఉమ్మడి జిల్లా స్థాయిలో జూలై 20న నిర్వహించే సమావేశంలో సమగ్ర వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో వివరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులు తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రతిపాదిత చర్యలు, భవిష్యత్తు ప్రణాళికల వివరాలను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ల తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్ నగర్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లా శాఖలవారీగా సమగ్ర కంటింజెన్సీ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల ప్రధాన కేంద్రాల్లో జూలై 20న నిర్వహించబోయే సమావేశంలో ఇన్‌చార్జి మంత్రులు, ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టర్లు ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమక్షంలో శాఖలవారీ కార్యాచరణ ప్రణాళికలను ప్రజెంటేషన్ రూపంలో వివరించాలని సూచించారు. వ్యవసాయ పంటల వైవిధ్యీకరణ, సాగునీటి నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్, మున్సిపల్ సేవలు, పశుసంవర్ధక రంగం, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై విస్తృత చర్చలు జరపాలని, ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులు, నీటి లభ్యత, పంటల మార్పిడి తదితర అంశాలపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ ఇన్‌చార్జి, డీపీఓ వెంకట్‌రెడ్డి, డీఆర్డీఓ నరసింహులు, డీఎంహెచ్‌వో డా. ఏ. శ్రీనివాసులు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉపాధితో ఆర్థిక స్వావలంబన
### గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజా కలం జూలై 18 (గద్వాల ప్రతినిధి)మహిళలు వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోనీ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నెలరోజుల పాటు మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇవ్వడంతో సొంతంగా పనులు చేసుకుని సంపాదించవచ్చన్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పొదుపు సంఘాలలో ఉండడం వలన బ్యాంకుల ద్వారా అందించే రుణాలతో చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందాలన్నారు. గద్వాల ప్రాంతంలో ఎక్కడా లేని వస్తువుల తయారీ పరిశ్రమను మహిళలు నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని, దీనికి కావాల్సిన శిక్షణ, రుణ సదుపాయానికి తన వంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, ఎల్డిఎం శ్రీనివాసరావు, ఏపిడి శ్రీనివాస్, ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పలువురు కౌన్సిలర్స్, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని కులాల అభ్యున్నతికి కృషి
## - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జూలై 18:
అన్ని కులాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగరంలోని కోయిల్‌కొండ ఎక్స్ రోడ్ వద్ద మున్సిపల్ నిధులు రూ.6.12 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక సదుపాయాలతో కూడిన మాడ్రన్ స్లాటర్ హౌస్ (జంతు వధశాల)ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా పట్టణంలో స్లాటర్ హౌస్ లేకపోవడంతో ఈ వృత్తిలో నిమగ్నమైన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, స్థానికంగా స్లాటరింగ్ చేసే కార్మికులతో చర్చించి, వారి అవసరాలకు అనుగుణంగా డిజైన్ రూపొందించి ఈ మాడ్రన్ స్లాటర్ హౌస్ నిర్మించామని తెలిపారు. కార్మికులకు సౌకర్యవంతంగా పని చేయడానికి అవసరమైన అన్ని వసతులను కల్పించినట్లు ఆయన చెప్పారు. ఇందులో పార్కింగ్ సదుపాయం, వెటర్నరీ డాక్టర్ సేవలు, విశ్రాంతి గదులు, నిరంతర నీటి సరఫరా వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక సంప్ (వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఏర్పాటు చేసి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ద్వారా ప్రధాన లైన్‌కు అనుసంధానం చేసినట్లు వివరించారు. ఈ స్లాటర్ హౌస్ ప్రారంభంతో పట్టణంలోని ఆరెకటిక , ఖురేషీ, వృత్తిదారులు మరియు ఇతరులకు దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించినట్లు ఆయన



పేర్కొన్నారు. ఇకపై నగరానికి చేరువలో ఉన్న మండలాల నుంచి కూడా నేరుగా ఇక్కడికి జంతువులను తీసుకురావడం సులభమవుతుందని తెలిపారు.
ఈ జంతు వధశాల నిర్మాణంలో మధ్యలో వచ్చిన ఇబ్బందులను అధిగమించి, అవసరమైన అదనపు నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సదుపాయాన్ని సంబంధిత వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్.పీ. వెంకటేష్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ , కార్పొరేటర్లు ఉమర్ కొత్వాల్, ఫయాజ్, ఫక్రుద్దీన్, శ్రీలేఖ, రమేష్, ఖమర్, మహబూబ్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, మున్సిపల్ కమిషనర్ రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు,
# నాణ్యమైన భోజనం అందించాలి
### మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ,జులై 18(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):
ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ నర్సాపూర్ (జి), భైంసా మండలాల్లో పర్యటించారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, కల్పిస్తున్న వసతులు, విద్యా బోధన, మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సంఖ్య, నేటి హాజరు, తదితర విషయాలను ఆరా తీశారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్లన్నింటిని పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. ప్రతి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాల ప్రాంగణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత భైంసా మండలంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలు, ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు, తదితర వివరాలను అధికారులను అడిగారు. త్రాగు నీటి సరఫరా కు సంబంధించి అంశాలను సమీక్షించారు. భవిష్యత్ ప్రణాళికల ప్రకారం నీటి నిర్వహణ ఉండాలని తెలిపారు. అనంతరం భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఈఓ భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఆర్డబ్ల్యుఎస్, నీటిపారుదల శాఖల ఈఈలు సందీప్, అనిల్ తహసిల్దార్ లు శ్రీకాంత్, శశి భూషణ్, ఎంపీడీఓ పుష్పలత, ఎంపివో తిరుపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఆడపిల్లల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
### - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
### - కళాశాలలో గ్రంథాలయ అభివృద్ధికి 50 వేల చెక్కును అందజేసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 18 :
ఆడపిల్లల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగరంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో రూ.25 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత తరగతి గదులు సరిపోకపోవడంతో కొత్త గదుల నిర్మాణం చేపట్టుతున్నామని తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయిన తర్వాత విద్యార్థులకు విశాలమైన, సౌకర్యవంతమైన తరగతి గదులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా దేశ్ పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ స్థాపనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బీఎస్సీ కంప్యూటర్స్‌తో పాటు ఇతర కోర్సుల విద్యార్థులు కూడా కంప్యూటర్ పరిజ్ఞానం పొందేందుకు సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. అదనంగా టాస్క్ సెంటర్ ద్వారా విద్యార్థులు వివిధ భాషలు నేర్చుకునే అవకాశాలు కల్పిస్తున్నామని, స్వల్పకాలిక శిక్షణా కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు వీటిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాబోయే పోలీస్ నియామకాల నేపథ్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు సిద్ధం కావాలని విద్యార్థులను ప్రోత్సహించిన ఎమ్మెల్యే, ఎన్‌సీసీ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి రోజువారీ సాధన చేయాలని సూచించారు. రాబోయే నెలల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉండనున్న నేపథ్యంలో, ఫైనల్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు ఇప్పటి నుంచే జనరల్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, మెంటల్ అబిలిటీ, రీజనింగ్ వంటి అంశాలలో ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. మహిళా విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఎంతోమంది అమ్మాయిలు విద్యను కొనసాగించగలుగుతున్నారని ఆయన తెలిపారు. అమ్మాయిలను చదివించడంలో వెనుకంజ వేయకుండా సమాన అవకాశాలు కల్పిస్తే వారు కుటుంబానికి, సమాజానికి ఆదారంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఉచిత బస్సు పథకం విజయవంతమై అనేక మంది విద్యార్థినుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి గారు కళాశాల గ్రంథాలయ అభివృద్ధికి తన సొంత నిధుల నుండి రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు.
ప్రతి సంవత్సరం రూ.50 వేల సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, హన్వాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి. మహేందర్, కార్పొరేటర్లు ఉమర్ కొత్వాల్, ఫయాజ్, అవేజ్,పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర నాయకులు రమేష్ ముకుందం , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజులు రెడ్డి,ఇంచార్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో కలెక్టరేట్ కు మద్దతు తెలిపిన మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్

కొత్తూర్ జులై 18 ప్రజా కలం ప్రతినిధి కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో డంపింగ్ యాడ్ జీవో 641 రద్దు చేయాలని ఛలో కాలేక్టరెట్ కు జేఏసీ అధ్యక్షులు అబంటి ప్రభాకర్ పిలుపుమేరకు కొత్తూరు మండలంలోని జేపీ దర్గాలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాలొన్న మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ ఉద్యమకారులకు రైతులకు ప్రజలకు మద్దత్తు తెలిపారు..అనంతరం కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు శేఖర్ రెడ్డి అక్రమ అరస్టును కండిస్తూ కొత్తూరు పోలీస్ స్టేషన్ కు వెళ్లి మద్దతు తెలిపారు..ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, కొత్తూరు కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ చారి , నందిగామ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు జంగా నర్సింహా యువజన అధ్యక్షులు వెంకట్ చారి, నియోజకవర్గ ఎస్సి సెల్ మాజీ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, కొత్తూరు మున్సిపల్ విరామోని దేవీందర్, చేగూర్ గ్రామ మాజీ వార్డు సభ్యులు పబ్బే శ్రీశైలం, పెంజర్ల సర్పంచ్ జగన్ నాయకులు కార్యకర్తలు ఉద్యమ కారులు ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు

## జౌలా-బి లో వనమహోత్సవం: గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చ



తానూర్, జులై 18(ప్రజా కలం): జౌలా-బి గ్రామంలో ముధోల్ సీఐ రవీందర్ నాయక్, తానూర్ ఎస్ఐ షేక్ జుబేర్ వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు,అనంతరం గ్రామ పెద్దలు, వార్డు సభ్యులతో సమావేశమై, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు, నేరాల నివారణ, ప్రజల భద్రతకు ఇవి ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు, దీనిపై గ్రామస్థులు సానుకూలంగా స్పందించి, కెమెరాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజలను ఆహ్వానిస్తూ నిర్వాహకుల పిలుపు

పాలేరు జులై 18(ప్రజా కలం న్యూస్ )
ప్రజలకు మెరుగైన కంటి ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఖమ్మం జిల్లాలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించనున్నారు. శిబిరంలో పాల్గొనే వారికి ఉచిత కంటి పరీక్షలు, వైద్యుల సలహాలు, అలాగే అవసరమైన వారికి కళ్లద్దాల పంపిణీ కూడా చేయనున్నట్లు తెలిపారు. అదనంగా, శిబిరంలో కంటి శుక్లాల (క్యాటరాక్ట్) సమస్యతో బాధపడుతున్న వారికి గుర్తింపు పరీక్షలు నిర్వహించి, అవసరమైతే గుంటా ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిబిరానికి హాజరై ఆరోగ్య సేవలను పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. శిబిరానికి వచ్చే వారు తమ పాత వైద్య నివేదికలు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## వర్షాలు తక్కువ.. రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

- శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి
- కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రూ.4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన.. చెక్కుల పంపిణీ.




పాలేరు జులై 18(ప్రజా కలం న్యూస్ ) ఎలినినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలి. అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు.

- రూ.4.61 కోట్లతో ప్రగతి బాట.. మండల పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు.
- సంక్షేమ హస్తం.. లబ్ధిదారులకు ఆసరా

కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# హైడ్రాకు రెండేళ్లు..మిన్నంటిన సంబరాలు

- హుస్సేన్‌సాగర్, నెక్లెస్ రోడ్డుల్లో భారీ ర్యాలీ
- రెండేళ్లలో 3,315 ఎకరాల భూమికి విముక్తి
- భూమి విలువ మార్కెట్ లో1.50 లక్షలు





హైదరాబాద్, జూలై 18 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రభుత్వ భూములు కాపాడాలి,చెరువులు, పార్కులకు ప్రాణం పోయాల్సిన అవసరం ఉంది. దీనితో ప్రభుత్వమే ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను తీసుకువచ్చారు.దీనితో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నగర రూపురేఖలను మార్చి, ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా అడుగులు వేస్తుంది.హైడ్రా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం నగరవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. ప్రజా ప్రయోజనార్థం కేటాయించిన స్థలాలను కబ్జా నుంచి కాపాడి కాలనీలకు కొత్త జీవం పోశారంటూ నగర ప్రజలు పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించారు. హైడ్రా తీసుకున్న చర్యలతోనే చెరువులు పునరుద్ధరణకు నోచుకుని ఆహ్లాదకర వాతావరణం నెలకొందని తెలిపారు. కొండలు,గుట్టలతో కూడిన ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుండి కాపాడి కోట్ల రూపాయల ఆస్థులను కాపాడారని కాలనీల వాసులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా ఫెన్సింగ్ వేసి కాపాడిన ప్రభుత్వ భూముల్లో స్థానికులు టపాసులు పేల్చి,కేరింతలు కొడుతూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా నగరం లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు హుస్సేన్‌సాగర్, నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు.ఎన్టీఆర్ గార్డెన్ నుంచి లుంబినీ పార్క్ వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రభుత్వానికి అనుకూలంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నగరానికి ఉజ్వల భవిష్యత్తును అందించేలా హైడ్రాను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

**3315 ఎకరాల భూమి, రూ. 1.50 లక్షల కోట్లు...**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన హైడ్రా దేశానికే ఆదర్శంగా నిలిచిందని పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొనియాడారు. ఇదే స్ఫూర్తితో హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, అన్ని జిల్లాల్లోని చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గత రెండేళ్ల కాలంలో రికార్డు స్థాయిలో 3,315 ఎకరాల భూమిని కబ్జాల నుంచి విముక్తి చేసిన హైడ్రా పనితీరు పై ప్రశంసల జల్లు కురిపించారు. ఈ భూముల విలువ మార్కెట్ లో సుమారు రూ. 1.50 లక్షల కోట్లు ఉంటుందని స్పష్టం చేశారు. హైడ్రా స్వాధీనం చేసుకున్న భూములను కాపాడి, మొక్కలు నాటి ప్రాణవాయువు, భూగర్భ జలాల పెంపు, వరదల కట్టడి చేశామన్నారు. ర్యాలీ అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సచివాలయానికి చేరుకుని వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలను అందజేశారు..



## చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీరాములు అందెల

- ఆటో భరత్ కు మద్దతుగా పోస్టర్లను విడుదల చేసిన శ్రీరాములు అందెల

వనపర్తి : ఇటీవల వనపర్తి జిల్లాకు చెందిన చందరి భరత్ కుమార్ ఆటో డ్రైవర్ గా తన జీవనాన్ని కొనసాగిస్తూ తన ఆటో వెనక మతం మారడం అనేది తండ్రిని మార్చుకోవడంతో సమానం....ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరు హిందువులే అని రాయగా ఆ యొక్క ఆటోను అత్తాపూర్ లో అన్యమతస్థుడు అడ్డుకొని పరుష పదజాలంతో దూషించి ఆటో భరత్ పై దాడి చేసిన నేపథ్యంలో ఆటో భరత్ కు మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు గారు మహేశ్వరం నియోజకవర్గ కాషాయ శ్రేణులతో కలిసి చార్మినార్ లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటో భరత్ రాసిన వ్యాఖ్యలతో కూడిన వాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హిందువులపై మరియు ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. హిందూ సమాజం తమ మత విశ్వాసాలను వ్యక్తీకరించే హక్కును కాపాడాలని, ఆటో భరత్‌పై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజానికి సంబంధించిన ప్రతి అంశంలో బీజేపీ అండగా ఉంటుందని, భావ ప్రకటన స్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ సమానంగా పరిరక్షించాలని పేర్కొన్నారు.

## ప్రేమ వ్యవహారమే కారణం

**కత్తితో దాడి చేసిన యువకుల అరెస్టు**

ఆళ్లగడ్డ : పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో సమీర్ అనే వ్యక్తి పై కత్తితో దాడి చేసిన నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈనెల 14వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో సమీర్ అనే వ్యక్తిపై నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టడం జరిగింది ఆళ్లగడ్డ పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న ఏవీ గోడౌన్ దగ్గర దోష హౌస్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను పట్టణ సీఐ నాగార్జునరావు ఎస్ఐ చిన్న వీరయ్య మరియు సిబ్బంది వారందరినీ అదుపులోకి తీసుకున్నారన్నారు పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని డిఎస్పి అయిన వారిలో మునగాల పెద్ద ఏల్లాలు కురువ వెంకట సుధీర్ తలారి నరేంద్ర మరియు దూదేకుల హుస్సేన్ బాబు ఉన్నారని నిందితుల దగ్గర నుండి రెండు మోటార్ బైకులు ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు ప్రేమ వ్యవహారమే ఈ దాడికి ప్రాథమిక కారణంగా గుర్తించినట్లు డిఎస్పి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## వి.కోటలో దారుణం..

**ప్రియుడితో కలిసి ఏడేళ్ల కొడుకుపై తల్లి అమానుషం**

చిత్తూరు జిల్లా : వి.కోట మండలంలో మానవత్వాన్ని మరిచిపోయే ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే అనుమానంతో ఓ తల్లి తన ప్రియుడితో కలిసి ఏడేళ్ల కుమారుడిపై అమానుషంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసుల సమాచారం ప్రకారం.. వి.కోట ఈశ్వర్ నగర్‌లో ఇళ్ళు అద్దెకు ఉంటున్న ఇంద్రజ భర్త మరణించగా, అనంతరం ఎర్రయపల్లి చెందిన రాజుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. తమ సంబంధానికి కుమారుడు విశాల్ అడ్డుగా ఉన్నాడని భావించిన ఇంద్రజ, తన ప్రియుడు రాజుతో కలిసి బాలుడిపై దారుణంగా దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదం

మేడ్చల్ : కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డుపై గొర్రెలను తరలిస్తూ, రోడ్డు పక్కన వాహనం ఆపి రాములు(60), రషీద్(40) అనే ఇద్దరు మెదక్ జిల్లా వాసులు నిద్రపోతున్నారు. ఆదే వీరి వాహనాన్ని గుర్తుతెలియని వాహనం వెనుకనుండి ఢీకొట్టి..రోడ్డు పక్కన పడుకున్న వీరి మీద నుండి వెళ్లిపోయింది.ప్రమాదంలో రషీద్ (40), రాములు (60) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం పోలీసులుగాలింపు చర్యలు చేపట్టారు.

## కేజీబీవీ విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు

ఆత్మకూరు : జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు డాక్టర్ షేక్షావలి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు.పాఠశాలలోని మొత్తం 280 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 41 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. కంటి అద్దాలు అవసరమైన విద్యార్థినులకు ఉచిత అద్దాలు అందజేస్తామని తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ షేక్షావలి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను ఎక్కువసేపు ఉపయోగించకుండా ఉండాలని సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆకుకూరలు, క్యారెట్, గుడ్లు, పండ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, చదివేటప్పుడు తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్యామల వైద్య సిబ్బంది కృష్ణవేణి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వివాదంలో ఆర్ఎస్ ప్రవీణ్



అదిలాబాద్ : కొద్దిరోజులుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మీద.. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు.. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యంగా గురుకులాల విషయంలో ప్రవీణ్ తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వేలకోట్ల కుంభకోణం జరిగిందని.. ఇదంతా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర అని ప్రవీణ్ కుమార్ మండిపడుతున్నారు. రోజుల వ్యవధిలోనే అనేకసార్లు విలేకరుల సమావేశం నిర్వహించి.. ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా భారతీయ జనతా పార్టీ నుంచి కౌంటర్ వచ్చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకుడు గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు.. గురుకులాల నిర్వహణ.. నిధుల ఖర్చు ఇటువంటి వాటిపై గువ్వల బాలరాజు కీలకమైన ఆధారాలు బయటపెట్టారు. 2013 నుంచి 2021 మధ్యకాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు భారీగా అక్రమాలు జరిగాయని.. దాదాపు పదివేల కోట్ల వరకు ప్రజదనం పక్కదారి పట్టిందని గువ్వల బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు తాను ముఖ్యమంత్రికి ఒక లెటర్ రాశారు. టెండర్ ప్రక్రియలు మొత్తం పక్కన పెట్టి.. నిధులను సంతానికి మళ్ళించుకున్నారని బాలరాజు ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ సాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ప్రవీణ్ కుమార్ ను మాత్రమే కాకుండా.. నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును కూడా బాలరాజు న్యాయ పరంగా లక్ష్యంగా చేసుకున్నారు. నాడు జరిగిన అక్రమాలకు కేసీఆర్ మద్దతు ఉందని.. ఆయన సపోర్టుతోనే ఇవన్నీ జరిగాయని బాలరాజు ఆరోపించారు. ఐపీఎస్ కేడర్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన గురుకుల సెక్రటరీ విధులను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కు ఏకంగా 10 సంవత్సరాల పాటు అప్పగించడం వెనక ఉన్న నిజాలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా ప్రవీణ్ సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మరోవైపు బాలరాజు ముఖ్యమంత్రికి రాసిన లేఖ.. చేసిన విమర్శలపై ప్రవీణ్ కుమార్ కూడా ఆదే స్థాయిలో స్పందించారు. ఇదంతా అబద్ధమని అన్నారు. కేవలం ఎనిమిది వందల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న గురుకులాలలో వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రవీణ్ ప్రశ్నించారు.. బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయాలని బాలరాజుకు చూపించారు. బాలరాజు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి.. బండి సంజయ్.. బాలరాజు తను లక్ష్యంగా చేస్తున్నారని.. ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు .

## ఉచిత మందుల పంపిణీ

జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని పరిశీలించారు.శిబిరంలో గ్రామస్తులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సర్పంచ్ సరిత గ్రామస్తులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎ ఎన్ ఎం విజయ,ఆశా వర్కర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్ శ్రీకళ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

కరీంనగర్ : జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఫోర్‌లైన్ రహదారికి సంబంధించిన భూసర్వే, అలైన్‌మెంట్ పనులనుపరిశీలించారు. ఫేజ్-1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా నివాస గృహాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా, ప్రత్యామ్నాయంగా బైపాస్ మార్గాల ఏర్పాటు సాధ్యమా అనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని, భూసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు.అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల ఇళ్లకు, జీవన విధానానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

# సాఫ్ట్ వేర్ నుంచి సాగువైపు..

నిజామాబాద్ : నేటి తరం యువత చదువు పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనో.. లక్షలు ఖర్చు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా, లండన్ వంటి విదేశాలకు వెళ్లాలనో కలలు కంటుంది. కానీ.. తెలంగాణకు చెందిన ఒక సాధారణ రైతు బిడ్డ మాత్రం ఆ గ్లామరస్ ఐటీ ప్రపంచాన్ని, విదేశీ అవకాశాలను కాలదన్ని తాను పుట్టిన మట్టిలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన సంజనా రెడ్డి సరికొత్త అగ్రి ఎంట్రపెన్యూర్‌గా మారి నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమె సక్సెస్ జర్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా.. లక్షలాది మంది నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.సంజనా రెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి ఐటీ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలనే లక్ష్యంతో ఎఇఋూ, ఉఖీఇ పరీక్షలు రాసి, మంచి స్కోర్‌తో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో అడ్మిషన్ కూడా సాధించింది. అంతా సిద్ధమై అమెరికాకు పయనమయ్యే సమయంలో ఆమె తనను తాను ఓ ప్రశ్న వేసుకుంది. 'ఉన్నత చదువుల కోసం నా సొంత ఊరిని, దేశాన్ని విడిచి విదేశాలకు ఎందుకు వెళ్లాలి? నేను చదువుకున్న చదువును, టెక్నాలజీని ఇక్కడే నా కళ్ల ముందే ఉన్న సమస్యలను పరిష్కరించ దానికి ఎందుకు ఉపయోగించకూడదు ?' అని ఆలోచించింది.

తాను ఒక రైతు బిడ్డ కావడంతో చిన్నతనం నుండి రైతులు పడే కష్టాలను, నష్టాలను సంజన కళ్లారా చూసింది. నెలల తరబడి ఎండనక, వాననక కష్టపడి పంట పండిస్తున్నప్పటికీ దళారీల వల్ల, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని గ్రహించింది. ఈ సమస్యకు టెక్నాలజీ, వ్యాపార ఆలోచనలతో చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తను రోజూ పొలంలో చేసే పనులను, వ్యవసాయ జీవన విధానాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. అలా ఆమె పోస్ట్ చేసిన పసుపు సాగు గురించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రజలు నేరుగా తమ పొలం నుంచే స్వచ్ఛమైన పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు. ఈ ఊహించని అవకాశాన్ని వ్యాపారంగా మార్చుకుంటూ ఆమె 'ఇందూరు ఫార్మ్స్' అనే ఈ-కామర్స్ స్టార్టప్‌ను ప్రారంభించింది. రైతుల నుంచి పంటను నేరుగా ఎటువంటి దళారీల ప్రమేయం లేకుండా మంచి ధరకు కొనుగోలు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించింది. నేడు ఈమె వ్యాపారం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై వంటి దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు విస్తరించింది.సంజన విజయగాథపై సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఎక్కడ పుట్టిందో.. ఆ మూలాల నుంచే ఎదగాలని నిర్ణయించుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకమని అంటున్నారు. నిజమైన మార్పు ఎప్పుడూ మూలాల నుంచే మొదలవుతుందని.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఇంత పెద్ద వ్యాపారాన్ని నిర్మించడం అద్భుతమని, తాను జీవితాంతం చూసిన సమస్యకు టెక్నాలజీతో పరిష్కారం కనుగొన్న సంజన నిజమైన ఎంట్రప్రెన్యూర్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. రైతు కూతురిగా మొదలైన ఆమె ప్రయాణం.. నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా మారిందని ప్రశంసిస్తున్నారు. నిజంగా సంజనా ప్రయాణం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం.

## ఎల్ నినో వల్ల రైతులు ప్రత్యామ్యాయ పంటలు వేయాలి

జయశంకర్ భూపాలపల్లి : ఎల్ నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ, తక్కువ నీటి వినియోగ పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎన్ లినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్న అంశంపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, సాగులో వైవిధ్యాన్ని పాటించి, తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ఆయన సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు వీలుగా మిల్లెట్స్, కూరగాయలు, పప్పు దినుసులు, పామాయిల్ సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల కంటే ఆరుతడి పంటలు, తక్కువ రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యటించి, ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటల వివరాలను రైతులకు వివరించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు బిందు, తుంపర్ల సేద్యం వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. బోరు బావుల ద్వారా పంట సాగు చేస్తున్న రైతులు వరి సాగు చేయొద్దని, రానున్న రోజుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడుతుందని తద్వారా పంట నష్టం వస్తుందని సూచించారు. కూరగాయలు సాగుకు ప్రభుత్వం ఎకరాకు 9600 రూపాయలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సాగు చేయాల్సిన పంటలపై జిల్లా కంటింజెంట్ (జిల్లా అత్యవసర ప్రణాళిక) ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా ఉద్యాన అధికారి తిరుపతి, వ్యవసాయ శాఖ ఏడీఎలు శ్రీపాల్, రమేష్, అన్ని మండలాల ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి.

దుబ్బాక ప్రజాకలం జూలై 18.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గాంధీ ఆసుపత్రిలో మృతి చెందాడు. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం.. తొగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన అక్కారం రాజలింగం (41) బంధువుల ఇంటికి అనాజీపూర్ గ్రామానికి వచ్చి, తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, దౌల్తాబాద్ 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ భాను ప్రకాష్, పైలెట్ నర్సింలు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



అనంతరం మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి రాజలింగం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య అక్కారం సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ కె. మానస తెలిపారు.

## ఉమ్మడి మెదక్ జిల్లా ఎల్‌నినో సమీక్షకు సర్వం సిద్ధం.

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఈ నెల 20న సమీక్ష సమావేశం .**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన**



సంగారెడ్డి, ప్రతినిధి జూలై 18( ప్రజా కలం): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఈ నెల 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్న సమీక్ష సమావేశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల సమన్వయంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రుల అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయిలో సమగ్ర సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలాశయాల నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, తాగునీటి పంపిణీ, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20న జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖలు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటల స్థితిగతులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసి సమావేశంలో సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఓ (పీడీ) జ్యోతి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## వర్గల్ నవోదయలో క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా ముగింపు

గజ్వేల్ నియోజకవర్గం: 18 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన--2026 శనివారం ఘనంగా ముగిసింది.ఈ విషయాన్ని విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు.ఈ ప్రదర్శనలో తెలంగాణలోని ఆసిఫాబాద్,కరీంనగర్, నల్గొండ,




ఖమ్మం,రంగారెడ్డి,సిద్దిపేట,నిజామాబాద్, నాగర్‌కర్నూల్,వరంగల్ జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 9 నవోదయ విద్యాలయాల నుంచి 61 శాస్త్రీయ నమూనాలు ప్రదర్శించబడ్డాయి.సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ--ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు,హరిత శక్తి,అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, వినోదాత్మక గణిత నమూనాలు,ఆరోగ్యం--పరిశుభ్రత, నీటి సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.ముగింపు కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ దాసి రాజేందర్, ఉప ప్రధానాచార్యులు మోహన్ రాథోర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సెమినార్‌లో విద్యార్థులు ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ విజయవంతమైన కార్యక్రమానికి సహకరించిన నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం, ఉపసంచాలకులు,అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బందికి ప్రిన్సిపల్ దాసి రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.ప్రారంభ,ముగింపు కార్యక్రమాలకు తెలుగు అధ్యాపకుడు విజయ్ కుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా,భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ఎస్. ఆంజనేయులు వందన సమర్పణ చేశారు.

## బిటిఆర్ ఓల్డ్ క్లబ్ హౌస్ లో గాన కోకిల జానకి సంస్మరణ సభ

**- జానకమ్మ ని స్మరించుకుంటూ సింగర్స్ పాడిన పాటలు అందరిని అలరించాయి**

**- జానకి సంస్మరణ సభ కార్యక్రమంలో ఎన్నో మధుర గీతాలు పాడిన గాయని గాయకులు**

**- జానకి అమ్మకి శ్రద్ధాంజలి ఘటించిన ప్రముఖులు గాయని గాయకులు**

మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు బిటిఆర్ ఓల్డ్ క్లబ్ హౌస్ లో గాన కోకిల జానకి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా గాన కోకిల జానకి అమ్మకి ప్రముఖులు గాయని గాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.సంగీత ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన జానకి అమ్మగారు 15



సంవత్సరాల నుండి మన బిటిఆర్ విల్లా 276 లో నివసిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే జానకమ్మని స్మరించుకుంటూ ఆమె పాడిన పాటలను పాడుతా తీయగా విన్నర్స్ నిత్య సంతోషి,వాగ్దేవి,శ్రీదేవి,రేవతి,తేజాంజలి వినోద్ బాబు,డాక్టర్ బంటి ప్రముఖ సింగర్స్ అందరూ బిటిఆర్ కు వచ్చి అందరిని అలరించారు. బి టి ఆర్ లో ఉన్న అందరూ పెద్ద ఎత్తున పాల్గొని జానకమ్మ మీద ఉన్న ప్రేమతో కార్యక్రమం పాల్గొని విజయవంతం చేసి గాయని గాయకులు పాడిన ఎంతో మధురమైన పాటలను విని ఎంతగానో బాగున్నాయంటూ అలాగే జాన కమ్మను గుర్తు చేసుకుంటూ ఆమె జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆమె లేకపోవడం అందరికీ తీరని లోటు అంటూ పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ గాయని గాయకులు బి టి ఆర్ సంబంధించిన వారు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వారాహి ప్రత్యంగిరా మాత ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు

**-మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**

**-కమ్యూనిటీ హాల్, టెలిఫోన్ కాలనీ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించిన కె ఎల్ ఆర్**



మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

ఆషాడ మాస నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వారాహి ప్రత్యంగిరా మాత దేవాలయంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్కేపురం డివిజన్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, అధ్యక్షులు పున్నా గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వారాహి, ప్రత్యంగిరా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆలయ కమిటీ, కాంగ్రెస్ నేతలకు లక్ష్మారెడ్డి సూచిం చారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు అడ్డంకులు లేకుండా పేదలందరికీ అందేలా చూడాలని... మహేశ్వరం నియోజ కవర్గం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కిచ్చెన్న వేడుకున్నారు. అనంతరం రూ.50 లక్షలతో జరుగుతున్న టెలిఫోన్ కాలనీ కమ్యూనిటీ హాల్ ను పనులు, రూ.52 లక్షలతో అభివృద్ధి చేస్తున్న ఆర్కేపురం పార్క్, వాకింగ్ ట్రాక్ పనులను కె ఎల్ ఆర్ పరిశీలించారు. యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి నగర వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికార యంత్రాంగం, కాంట్రాక్టర్లకు కిచ్చెన్న సూచిం చారు. ఈ సందర్భంగా ఆర్కేపురం, ఎన్టీఆర్ నగర్ డివిజన్ల నాయకులు, స్థానికులు పలు సమస్యలను కె ఎల్ ఆర్ దృష్టికి తెచ్చారు. తాగునీటి సమస్య లేకుండా చూడా లని వాటర్ బోర్డు అధికారులకు లక్ష్మారెడ్డి కిచ్చెన్న విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, డివిజన్ లోని కాలనీ అధ్యక్షులు,పలు సంఘాల నేతలు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఓఆర్ఆర్‌పై మృత్యు తాండవం..

**-ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం..**

**- ఇద్దరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు..**

పటాన్‌చెరు, జులై 18 (ప్రజా కలం) ప్రతినిధి

ఔటర్ రింగ్ రోడ్‌లోని సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.వేగంగా వెళ్తున్న ఫార్చ్యూనర్ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ ఎదురుగా వస్తున్న వాహనాలపై పడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం హర్యానా రాష్ట్రానికి చెందిన ఎ=70ఎ4568 నంబర్ గల ఫార్చ్యూనర్ కారులో ముగ్గురు ప్రయాణికులు పటాన్‌చెరు వైపు వెళ్తుండగా,సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో వాహనం అదుపు తప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొడుతూ ఎదురుగా ఉన్న రహదారిపైకి వెళ్లింది. అదే సమయంలో బొల్లారం వైపు వెళ్తున్న ం+08+9450 నంబర్ గల ఎంజీ ఆస్టర్ ఈవీ కారును ఫార్చ్యూనర్ ఢీకొట్టింది. అనంతరం అదే మార్గంలో వస్తున్న ం+08జీ=5762 నంబర్ గల టాటా నెక్సాన్ కారు కూడా ఫార్చ్యూనర్‌ను ఢీకొంది.ఈ ప్రమాదంలో టాటా నెక్సాన్ కారులో ప్రయాణిస్తున్న శివ నాగరాజు (43), తండ్రి రామమోహన్‌రావు, ఆనంద్‌నగర్,బండ్లగూడ, నాగోల్ నివాసి అక్కడికక్కడే మృతి చెందాడు.అలాగే ఫార్చ్యూనర్ కారులో ప్రయాణిస్తున్న కైలాష్ రామ్ (27),తండ్రి మోహన్ రామ్, రాజస్థాన్‌కు చెందిన విద్యార్థి కూడా ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదంలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా,వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఎంజీ ఆస్టర్ ఈవీ కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ఎలాంటి గాయాలు కాకపోయినా,వాహనం మాత్రం దెబ్బతిన్నట్లు పోలీసులు తెలిపారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..



## డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డి.ఎం.ఈ) కి పి,వై,ఎల్ వినతి

**- గాంధీ ఆస్పత్రి ఔషధాల కొనుగోళ్లలో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి**

**- డి,ఎం,ఈ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన**

**- వై,ఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష,కార్యదర్శులు బి,ఎస్.కృష్ణ, కొల్లూర్ భీమేష్**

మహేశ్వరం, జులై 17,(ప్రజా కలం)

గాంధీ ఆస్పత్రి ఔషధాల కొనుగోళ్లలో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వై,ఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష,కార్యదర్శులు బి,ఎస్.కృష్ణ, కొల్లూర్ భీమేష్ కోరారు.ఈ సందర్భంగా పి,వై,ఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష,కార్యదర్శులు బి,ఎస్.కృష్ణ, కొల్లూర్ భీమేష్ లు మాట్లాడుతూ గాంధీ ఆసుపత్రిలో స్థానిక కొనుగోళ్ల (లోకల్ పర్చేస్) పేరుతో రూ.7 కోట్ల విలువైన ఔషధాలకు రూ.13 కోట్ల బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి, ఇలాంటి అవినీతికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి రూపాయి ప్రజలు చెల్లించే పన్నుల సొమ్ము, ఆ నిధులను పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఆ నిధులను పై అధికారుల కన్నుగప్పి కొందరు అవినీతి అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై దోచుకుంటున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు లేవని చెప్పి, రోగులను బయట మెడికల్ షాపులకు పంపుతూ, మరోవైపు కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం క్షమించరాని నేరం. వైద్యారోగ్య శాఖ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల కొనుగోళు తెలంగాణ మెడికల్ సర్వీసెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా పారదర్శక ఈ-టెండర్ విధానంలో జరగాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే పరిమిత స్థాయిలో లోకల్ పర్చేస్ కు అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ప్రతి కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు, బ్యాచ్ నెంబర్లు, గడువు తేదీలు, స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, ఆడిట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉన్నా, పట్టించుకోవడంలేదు. ఈ నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు కొనుగోళ్లు, తప్పుడు బిల్లులు, నాసిరకం మందుల సరఫరా లేదా అవసరం లేని మందులను కొనుగోలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

గత కొద్ది రోజుల క్రితం ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పి.వై.ఎల్) అనేక సర్వేలు చేశామని ముఖ్యంగా పూర్తిస్థాయిలో మందులు ఇవ్వకుండా నామమంత్రంగా ఒకటి రెండు ఇస్తూ బయట ప్రైవేట్ మెడిసిన్ తీసుకోవాలని చెప్తున్నారు. ఎమర్జెన్సీ వార్డుల్లో ఏకంగా ప్రైవేట్ మెడిసిన్ అమ్ముతున్న పరిస్థితి గాంధీలో కనబడుతోంది. టాయిలెట్స్ నుండి మొదలుకొని ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తూ స్ట్రక్చర్ లు కూడా దొరకని దుస్థితి ఉంది. స్కానింగ్ సెంటర్లు ఎక్కువ సంఖ్యలో లేక ఎమర్జెన్సీ వచ్చిన పేషెంట్స్ రోజులు వెయిటింగ్ చేయాల్సి వస్తుంది. కనీసం , కాటన్ కూడా లేవని అన్నారు. వీల్ చైర్స్ కూడా ఎక్కువ సంఖ్యలో పని చేయడం లేవు, అంబులెన్స్ వస్తే వీల్ చైర్స్ లేక అంబులెన్స్లోనే ఆగాల్సి వస్తుంది. పూర్తి స్థాయిలో బెడ్లు, బెడ్ షీట్స్ కూడా లేవు. సెలైన్ స్టాండ్స్ కూడా లేవు. ఎక్సరే రిపోర్ట్ మొబైల్లో ఫోటో తీసుకోవాలనడంతో పేషంట్స్ ఇబ్బంది పడుతున్నారు. ఎమర్జెన్సీ వార్డులో జూనియర్ డాక్టర్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ప్రైవేట్ మందుల షాపులో బిల్లులు ఇవ్వకుండా, అదనపు రేట్లకు అమ్ముతూ 20% డిస్కౌంట్ ఇవ్వడం లేదు. అలాగే ప్రతి విభాగంలో టాయ్‌లెట్స్ అధ్వానంగా ఉన్నాయి. పేషంట్స్ దగ్గర సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారు. టాయిలెట్ నుండి మొదలుకొని స్కానింగ్ సెంటర్లు వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. కావున దీనిపై పరిశీలించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు లేనియెడల ఉద్యమ కార్యచరణ తీసుకుంటామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కుంభోజు కిరణ్, పి వై గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సీఎం సుధాకర్,కార్తీక్, విజయ్ తదితరులు పాల్గొనడం జరిగింది.






# ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తం

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు మంత్రి వివేక్ పిలుపు
- సిద్దిపేటలో వ్యవసాయ శాఖల సమీక్ష..
- ప్రతి గ్రామం నుంచి ముగ్గురు రైతులకు ఆయిల్ పామ్ శిక్షణ-
- టామ్‌కామ్ ద్వారా జర్మనీలో ఉద్యోగాలకు అవకాశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి:
18 జూలై ( ప్రజా కలం ప్రతినిధి )
వానాకాలం--2026 నేపథ్యంలో ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు.శనివారం సిద్దిపేట ఐడీఓసీలో వ్యవసాయ అనుబంధ శాఖలు,ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే ఆయిల్ పామ్, కంది,రాగులు,సజ్జలు వంటి పంటలను రైతులు సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమైన నీటితో మూడు ఎకరాల ఆయిల్ పామ్ లేదా నాలుగు నుంచి ఎనిమిది ఎకరాల వరకు చిరుధాన్యాలు సాగు చేయవచ్చని తెలిపారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు,అధిక ఆదాయం,అంతర పంటల లాభాలపై రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.ప్రతి గ్రామం నుంచి కనీసం ముగ్గురు రైతులను ఎంపిక చేసి ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక శిక్షణ అందించి,వారిని గ్రామస్థాయి మార్గదర్శకులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

భవిష్యత్తులో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని నీటి వృథాను నివారించడం,భూగర్భ జలాల సంరక్షణ, ఫార్మ్ పాండ్లు,ఇంకుడు గుంతల ఏర్పాటుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,విద్యుత్ చౌర్యాన్ని అరికట్టి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలపై మాట్లాడుతూ,ఇప్పటికే సుమారు ఐదు వేల మందికి జర్మనీలో ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు.

జిల్లాలో ఆసక్తి ఉన్న 100 మంది నిరుద్యోగ యువత నమోదు చేసుకుంటే సిద్దిపేటలోనే జర్మన్ భాషా శిక్షణ ఇచ్చి,అనంతరం జర్మనీలో ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ,జూన్,జూలై నెలల్లో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. అయితే రాబోయే మూడు రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసిందని, ప్రస్తుతం జిల్లాలో తాగునీటి సమస్య లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్,ఆర్డీవోలు,ఏఎంసీ చైర్మన్లు,ఆత్మ కమిటీ సభ్యులు,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## రేవంత్‌పై మహిపాల్ రెడ్డి ఫైర్..

### -జాబ్ క్యాలెండర్‌పై కాంగ్రెస్‌కు మహిపాల్ రెడ్డి సవాల్..

పటాన్‌చెరు, జులై 18 (ప్రజా కలం) ప్రతినిధి
ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు.భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్‌చెరు నుంచి సుమారు 1,200 వాహనాల్లో పార్టీ శ్రేణులతో ఆయన బయలుదేరారు. అంతకుముందు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ర్యాలీని ప్రారంభించి పటాన్‌చెరు పురవీధుల గుండా ఔటర్ రింగ్ రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, 2023లో ప్రియాంక గాంధీ ప్రకటించిన యువజన ప్రకటనలో రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చినా, రెండున్నరేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగులను నిరాశపరిచిందని ఆరోపించారు. 2028 ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## ప్రజలను నమ్మించి మోసం చేసింది సీఎం రేవంత్ రెడ్డి కాదా.

### ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలం చెందిన సీఎం రేవంత్ రెడ్డి

### మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గుర్రంపల్లి మహేందర్ యాదవ్

మహేశ్వరం, జులై 28 (ప్రజా కలం)
ప్రజలను ఎన్నో హామీలు ఇచ్చి నమ్మించి మోసం చేసింది సీఎం రేవంత్ రెడ్డి కాదా అని మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గుర్రంపల్లి మహేందర్ యాదవ్ ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మహేశ్వరం మండలం బీ ఆర్.ఎస్ పార్టీ యువ నాయకులు గుర్రంపల్లి మహేందర్ యాదవ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను మభ్యపెట్టారని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని అన్నారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి, ఇంతవరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని విమర్శించారు. ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లు, మహిళలకు స్కూటీలు, భారీ ఉద్యోగ నియామకాలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. యువశక్తి ఒక్కసారి పోటెత్తితే అధికార పీఠాలు కదిలిపోతాయని ఆయన హెచ్చరించారు.



## యువ సంగ్రామ సదస్సు"కు బయలుదేరిన

### రాజేంద్రనగర్ నియోజకవర్గము కాటేదాన్, మైలార్దేవపల్లి యువత

### కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్



రాజేంద్రనగర్, జులై 17, (ప్రజా కలం) రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి ఆదేశాల మేరకు సరూర్ నగర్ "యువ సంగ్రామ సదస్సు"కు బయలుదేరిన రాజేంద్రనగర్ నియోజకవర్గము కాటేదాన్, మైలార్దేవపల్లి యువత రాజేంద్రనగర్ కాటేదాన్ దగా చేసిన రేవంత్ సర్కార్‌ను నిగ్గ దీసేందుకు 'యువ సంగ్రామ సదస్సు'కు రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ గారి ఆధ్వర్యంలో భారీగా బయలుదేరిన యువత, నాయకులు అడుగడుగునా పెద్ద ఎత్తున నినాదాలతో యువతా తరలిరండి ఈ మోసపు రేవంత్ సర్కార్ అంతు తేల్చుదాం అంటూ స్లోగన్లతో, ప్లకార్డులతో కదముదొక్కిన యువత,గులాబీ శ్రేణులు ఈ సందర్భంగా వెంకటేష్ గారు మాట్లాడుతూ హైకోర్టు అనుమతి ఇచ్చినప్పటికీ "యువ సంగ్రామ సదస్సు"ను అడ్డుకునేందుకు రేవంత్ ప్రభుత్వం కుట్రలు. యువ సంగ్రామ సదస్సుకు హాజరుకాకుండా అడుగడుగునా పోలీసులతో అడ్డంకులు సృష్టించిన అదరక బెదరక ప్రజాస్వామ్య పద్ధతిలో నిరుద్యోగ సమస్యలు, యువత హక్కుల సాధనకై సదస్సుకు హాజరు కావడం జరిగిందని తెలిపారు.కోర్టు అనుమతితో సభ నిర్వహిస్తుంటే అడ్డుకోవడం ఏంటి? నిరుద్యోగుల పట్ల వివక్ష చూపడం రేవంత్ ప్రభుత్వానికి తగదు" అని వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేష్ గారితో పాటు యాదగిరి భాస్కర్ కాటేదాన్ కార్మిక విభాగం అధ్యక్షుడు ఉప్పల్ శ్రీను వెంకటరమణ అశోక్ కుమార్ సునీల్ అనిల్ రాజకుమార్ బొడ్రాయి శివ సరికొండ దుర్గేష్ యాదయ్య సులేమాన్ డివిజన్ అధ్యక్షులు జహీర్ ఖాన్ మొహమ్మద్ నహీముద్దీన్ శివ పైల్వాన్ రాజు కార్తీక్ తిరుపతి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు

## భక్తి వెల్లువలో జగన్నాథ రథయాత్ర..

### -పటాన్‌చెరులో భక్తి వెల్లువ.. వైభవంగా జగన్నాథుడి రథయాత్ర..

పటాన్‌చెరు, జులై 18 (ప్రజా కలం) ప్రతినిధి
భక్తుల జయజయధ్వానాల మధ్య పటాన్‌చెరు పట్టణంలో జగన్నాథుడి రథయాత్ర వైభవంగా జరిగింది.కోదండ సీతారామస్వామి దేవాలయం వద్ద హరే




రామ హరే కృష్ణ స్వర్ణ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బంగారు చీపురుతో మార్గాన్ని ఊడ్చి, రథాన్ని లాగి ప్రారంభించారు.అందంగా అలంకరించిన రథంపై జగన్నాథుడు,బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలను ప్రతిష్ఠించి పట్టణ ప్రధాన వీధుల గుండా భజనలు, కీర్తనల మధ్య రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పటాన్‌చెరు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, బంగారుగడ్డలో మూడు ఎకరాల్లో బాలాజీ దేవాలయం, కృష్ణుడి దేవాలయం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన్ దేవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్ర బిక్షపతి, పృథ్వీరాజ్, అశోక్, నర్సింలు, చంద్రశేఖర్, మల్లేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

## బేగంపేట పోలీస్ స్టేషన్‌లో వనమహోత్సవం

### 60 మొక్కలు నాటిన పోలీసులు.

దుబ్బాక ప్రజాకలం జూలై 18.
వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా సిద్ధిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం గజ్వేల్ ఏసీపీ కె.నర్సింహులు ఆధ్వర్యంలో బేగంపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో 60 మొక్కలను నాటారు. అనంతరం మొక్కలకు నీరు పోసి వాటి సంరక్షణ బాధ్యతలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా




ఏసీపీ కె.నర్సింహులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వనమహోత్సవం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాకుండా, వాటిని పెంచి పరిరక్షించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ సీఐ రవికుమార్, గజ్వేల్ టౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బేగంపేట ఎస్ఐ రేణుక, కుకునూర్ పల్లి ఎస్ఐ బాలకృష్ణ, తొగుట ఎస్ఐ నవీన్, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌తో పాటు తొగుట సర్కిల్‌కు చెందిన పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం.




దుబ్బాక జూలై 18 (ప్రజా కలం)
ప్రభుత్వ జూనియర్ కళాశాల, దౌల్తాబాద్‌లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ఆవరణను పరిశుభ్రపరచడంతో పాటు మొక్కల సంరక్షణ చేపట్టి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. ఎం.మంగత, ఎం.సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాస్తవ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన విద్యా వాతావరణం విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందిస్తుందని తెలిపారు. స్వచ్ఛతను నిత్యజీవితంలో భాగంగా చేసుకొని పర్యావరణ పరిరక్షణలో ప్రతి విద్యార్థి తన వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ శివకుమార్, అధ్యాపకులు రాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ, దయానంద్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, భాగ్యమ్మ, రమ్య, పవన్ కుమార్, నాగేశ్వరరావు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్,సైబర్ క్రైమ్‌పై అవగాహన



గజ్వేల్:18 జూలై ( ప్రజా కలం ప్రతినిధి) సమగ్ర శిక్ష అభియాన్ కోర్స్ డైరెక్టర్ పి.అంజి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్-సర్వీస్ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు ట్రాఫిక్ మరియు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.సత్యనారాయణ పాల్గొని రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం,అతివేగం,మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు,ఓటీపీ,బ్యాంకింగ్ ఫ్రాడ్‌లు,డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా మోసాలు వంటి సైబర్ నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలో సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## కందుకూరు ఎక్స్ రోడ్ లో ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన కందుకూర్ సర్పంచ్ సరికొండ పాండు

## ఉప సర్పంచ్ సౌడపు మమత వెంకటేష్ గౌడ్

కందుకూరు, జులై 17, (ప్రజా కలం)
కందుకూరు ఎక్స్ రోడ్ లో కె ఎల్ ఆర్ సహకారంతో హెచ్ఎండిఏ నిధులతో 15 లక్షల రూపాయలతో ఐమాక్స్ లైట్స్ కందుకూర్ సర్పంచ్ సరికొండ పాండు ఉప సర్పంచ్ సౌడపు మమత వెంకటేష్ గౌడ్ వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బర్కాంమంజుల వెంకటేష్. టంకరి ఉమా కాంత్ రెడ్డి. నిమ్మ రాజశేఖర్ రెడ్డి. రొట్టెల శ్రీలత కృష్ణ. కందడి నరసింహ. మోటె రమేష్. ఎడ్ల సునీత సుదర్శన్. నిమ్మ జయమ్మ మల్లారెడ్డి. తాళ్ల కార్తీక్. సిరిగిరి కవితా జంగా చారి. మాజీ ఉపసర్పంచ్ గుంద్ర సుధాకర్ రెడ్డి. బిసి సెల్ అధ్యక్షులు సరికొండ జగన్. గ్రామ శాఖ అధ్యక్షులు పాముల కృష్ణ టంకరి హనుమంత్ రెడ్డి. సరికొండ జగన్. శ్రీశైలం శ్రీనివాస్ గౌడ్ నిరంజన్ మహేందర్ రాజశేఖర్ రెడ్డి ఫయాజ్ ప్రశాంత్ అనిల్ సిద్ధూ కారోబార్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ కార్యాలయంలో SIR ఓటర్ల సవరణ ఫారమ్‌లపై కీలక సమీక్ష

### క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని డివిజన్ అధ్యక్షులకు పిలుపు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్, మేడ్చల్ పార్లమెంట్ కాంగ్రెస్ కనెక్ట్ ఇంచార్జి పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్, మేడ్చల్--మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో-



ఆర్డినేటర్ /టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల అధ్యక్షులతో కలిసి వారు SIR (Special Intensive Revision) ఎన్యుమరేషన్ ఫారమ్‌లపై సుదీర్ఘంగా చర్చించి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై డివిజన్ అధ్యక్షులకు, పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల సంఘం జారీ చేసిన సాప్ (Standard Operating Procedure) ప్రకారం ప్రతి బూత్ పరిధిలో ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలన మరియు ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలన, ఓటర్లకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై నాయకులకు సూచనలు చేశారు. SIR ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి కోర్టు నుండి పటాన్ చెరు మధ్య రెండో బస్సు సర్వీస్ ప్రారంభం

కూకట్ పల్లి, జులై 18, ప్రజా కలం ప్రతినిధి:

బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి కోర్టు వరకు రెండో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు బార్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు నుంచి బయలుదేరే బస్సు ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్,



గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా ప్రయాణించి ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలుదేరి అదే మార్గంలో ప్రయాణించి సాయంత్రం 6:15 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటుంది. ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని బస్సు సేవ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్, న్యాయాధికారి మరియు టీజీఎస్‌ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె సురేందర్ గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నిజాంపేట్ తుర్క చెరువు అభివృద్ధి పనులను పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నిజాంపేట్ తుర్క చెరువు అభివృద్ధి పనులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించి, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... తుర్క చెరువు అభివృద్ధి పర్యావరణ పరిరక్షణకు ఎంత ముఖ్యమో, అదే స్థాయిలో దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాల జీవన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అభివృద్ధి పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం కాకుండా, మానవతా దృక్పథంతో సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

ప్రజల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి ఈ మూడు సమాన ప్రాధాన్యంతో ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వరగాని వాసు, తాటిరెడ్డి, మురళి, మౌళేశ్వర్ రావు, రఫియాబేగం, చిట్ల దివాకర్, వీరేష్, ఇందిర కడియాల, నాగరాజ్, సాయి, బాల బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా

# తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్



ఇబ్రహీంపట్నం, జులై 17,(ప్రజా కలం)

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంత్రి సందర్శించి పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్‌లో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఎదిగామని, ప్రస్తుతం విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, తల్లిదండ్రుల ఆశలు, త్యాగాలను గుర్తుంచుకోవాలని, ఓటమిని చూసి నిరాశ చెందకుండా నిరంతర సాధనతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విజయం అనేది ఒక్కరోజులో రాదని, ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వినయాన్ని కోల్పోకుండా నిరాడంబరంగా ఉండటమే నిజమైన గొప్పతనమని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీల పెంపు, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్యను అందించేలా ఆధునిక మౌలిక వసతులతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కృతజ్ఞతా భావంతో చదువుకోవాలని సూచించారు. విజయం అంటే కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదని, ఎంచుకున్న ప్రతి రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో శ్రమించాలని చెప్పారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతి విద్యార్థి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇతర అధికారులు పాల్గొన్నారు.




## వర్షాలు సమృద్ధిగా కురవాలని నీళ్ల బిందెలతో శివయ్యకు అభిషేకం చేసిన కందుకూరు కొలనుగూడ గ్రామ ప్రజలు

కందుకూరు, జులై 17, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో కందుకూరు మండలం కొలను గూడ గ్రామ మహిళల ఆధ్వర్యంలో గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని కోరుతూ కందుకూరు మండలం



కొలనుగూడ గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా నీళ్ల బిందెలతో శివలింగం మునిగేలా బిందెలతో నీరు పోసి శివయ్యను మనసు పూర్తిగా వర్షం పడేలా ప్రార్థించారు. ప్రజలు మహిళలు ఆట నిర్వహించారు. గ్రామమంతా తిరుగుతూ భక్తిశ్రద్ధలతో ఈ ఆచారాన్ని నిర్వహించి, గ్రామానికి మంచి వర్షాలు కురవాలని ప్రార్థించారు.ప్రస్తుతం విత్తనాలు వేసే సమయం దాటిపోతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంచి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతుల కష్టాలు తొలగి వ్యవసాయం సాఫీగా సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గ్రామ సంప్రదాయాలను కొనసాగిస్తూ శివయ్యను వర్షదేవుని ప్రార్థించారు.

## వెంకయ్య పార్థివ దేహానికి పలువురు ప్రముఖుల ఘన నివాళులు

కూకట్ పల్లి, జులై 18, ప్రజా కలం ప్రతినిధి:

కె పి హెచ్ బి కాలనీ సీనియర్ నాయకుడు (అందరివాడు) పి వి



రమణ తండ్రి శ్రీ పి వెంకయ్య శనివారం తెల్లవారు జామున పరమపదించారు. ఈ విషయం తెలిసి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాస రావు, పగడాల బాబురావు, బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా మరియు పలువురు రాజకీయ నాయకులు వారి నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ నిరాడంబర జీవనం, మంచితనం, మానవత్వం, కుటుంబం పట్ల ఆయన చూపిన ప్రేమ ఎల్లప్పుడూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి అని అన్నారు.

## నిరుద్యోగుల గొంతుకగా 'యువ సంగ్రామ సదస్సు

### నార్సింగి నుండి సరూర్‌నగర్ స్టేడియానికి భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

### నార్సింగి మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి

రాజేంద్రనగర్ , జులై 17,(ప్రజా కలం)

తెలంగాణలో నిరుద్యోగ యువత సమస్యలు, పెండింగ్ ఉద్యోగాల భర్తీ తదితర అంశాలను ప్రధాన అజెండాగా తీసుకొని బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు'కు సరూర్‌నగర్ స్టేడియం వేదికైంది. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, యువత భారీగా తరలివచ్చారు.ఇందులో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధి నుండి దాదాపు 100 మంది నిరుద్యోగ యువకులు సభకు నార్సింగి మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. గత ఎన్నికల్లో నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పిస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక తమను తీవ్రంగా మోసం చేసిందని ఈ సందర్భంగా యువత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రోజుల్లో నిరుద్యోగులకు అండగా ఉంటామని, వారి హక్కుల కోసం పోరాడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభలో హామీ ఇవ్వడంతో సరూర్‌నగర్ స్టేడియం ప్రాంగణం మొత్తం విద్యార్థులు, నిరుద్యోగుల ఈలలు, కేకల ఉత్సాహంతో మారుమోగిపోయింది. ఘనంగా తరలివెళ్లిన నేతలు ఈ విజయవంతమైన సభకు నార్సింగి మున్సిపాలిటీ నుండి బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. నార్సింగి మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు సరూర్‌నగర్ స్టేడియానికి బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ ముక్తార్, కోకాపేట్ గణేష్ ముదిరాజ్ గణేష్ రెడ్డి, మహిపాల్, సంతోష్,శ్రీకాంత్ రెడ్డి పర్విదరాజు, ఇమ్రోస్, రాజు, తిరుపతి గౌడ్ భగవాన్, హనుమంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## నిరుద్యోగుల కోసం బీఆర్ఎస్ రణభేరి..

### -సరూర్‌నగర్‌కు పటాన్‌చెరు బీఆర్ఎస్ భారీ ర్యాలీ..

పటాన్‌చెరు, జులై 18(ప్రజా కలం) ప్రతినిధి

నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్‌చెరు నుంచి భారీ ర్యాలీ బయలుదేరింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు మేరకు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన నివాసం నుంచి భారత రాష్ట్ర సమితి నాయకులు, ఎంకేవై యువసేన సభ్యులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసే లక్ష్యంతో నిర్వహించిన ఈ సదస్సుకు పటాన్‌చెరు నుంచి విశేష స్పందన లభించింది..



# రాజుల సొమ్ము రాళ్ళ పాలు అంటే ఇదేనా?

- పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి దాదాపు 6 సంవత్సరాలు గడచిన పట్టించుకోరా...
- ప్రభుత్వ సొమ్ము అంటే ఎవరికి లెక్క లేదా...
- ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజలకు టాయిలెట్ లేక ఇబ్బంది పడుతున్న పట్టించుకోరా
- లక్షల రూపాయలు ఖర్చు చేసి టాయిలెట్ కట్టి ఎందుకు ఉపయోగించడం లేదు
- తక్షణమే ఎమ్మార్వో కార్యాలయంలో ఉన్న టాయిలెట్స్ ని ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం జోక్యం చేసుకోవాలి








భుదాన్ పోచంపల్లి జులై 18 ( ప్రజా కలం ) రాజుల సొమ్ము రాళ్ళ పాలు అంటే ఇదేనా అని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలో ఎమ్మార్వో కార్యాలయంలో నిరుపయోగ కరంగా ఉన్న టాయిలెట్ చూస్తే అర్థమవుతుంది.యాదాద్రి భువనగిరి జిల్లా భుదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎమ్మార్వో కార్యాలయంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి దాదాపు 6 సంవత్సరాలు గడిచాయి. ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులోకి టాయిలెట్స్ తీసుకురాకపోవడానికి గల కారణాలయంతో అధికారులు చెప్పాలన్నారు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ టాయిలెట్స్ ని ఎందుకు ఉపయోగించడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వస్తూ ఉంటారు అందులో మహిళలు పురుషులు ఉంటారు ఇక్కడ ప్రభుత్వ కార్యాలయంలో టాయిలెట్స్ లేకపోవడం వల్ల ప్రజలు ఎంతగానో ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు లక్షల ఖర్చుపెట్టి టాయిలెట్స్ ఎందుకు నిర్మించారో , ఎందుకు ఇలా వదిలేసారు. అధికారులకే తెలియాలి మరి గతంలో భువనగిరి ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి హయాంలో నిర్మించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు చూడడానికి పేరుకు మాత్రమే టాయిలెట్స్ ఉన్నాయి ప్రతినిత్యం ఎమ్మార్వో ఆఫీస్ కి ఎంపీడీవో ఆఫీస్ కి ఎంతోమంది ప్రజలు వారి వారి సమస్యల గురించి వచ్చి వెళుతుంటారు. కనీసం పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగించడానికి లేకపోవడంతో ఇబ్బందులకి తలెత్తుతున్నారు. ముఖ్యంగా ఆడవాళ్ళు మాత్రం చాలా ఇబ్బందిగా ఉన్నది. అధికారులు వారి వారి కార్యాలయంలో టాయిలెట్స్ ఉంటే సరిపోతుందా. ప్రజలకు అవసరం లేదా ఇప్పుడు ఉన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గెలిచి రెండు సంవత్సరాలు గడిచాయి. ఎంపీడీవో కార్యాలయానికి ఎన్నోసార్లు వచ్చారు.

ఇది కనిపించడం లేదా, చూసి చూడనట్టుగా వెళ్లి వస్తున్నారేమో అని అక్కడ ఉన్న స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి తక్షణమే స్థానిక ప్రజాప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కారం చూపించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## "హరే కృష్ణ" నామస్మరణతో మార్మోగిన ప్రగతి నగర్ వీధులు.. ఘనంగా రథయాత్ర

నిజాంపేట్, జూన్ 18 (ప్రజా కలం): ప్రగతి నగర్‌లో శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ పవిత్ర రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, జగన్నాథుని రథాన్ని లాగి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భజనలు, కీర్తనలు, నృత్యాలు మరియు ప్రసాద వితరణతో ప్రగతి నగర్ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తజన సంద్రంగా మారాయి.

**ఘనంగా ప్రారంభమైన రథోత్సవం**

సాయి కృష్ణ కాలనీ వేదికగా సాయంత్రం ఈ రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన దివ్య రథంపై కొలువైన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవిలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. “హరే కృష్ణ” నామస్మరణతో, భక్తిశ్రద్ధలతో భక్తులంతా రథాన్ని ముందుకు లాగారు.

**ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖులు**

ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి నియోజకవర్గ ప్రముఖులతో పాటు పలు పార్టీల నాయకులు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. రథయాత్ర కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కోలాన్ రాజశేఖర్ రెడ్డి, ప్రగతి నగర్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, బండారి లేఔట్ అధ్యక్షుడు వాసు వరగాని, నాయకుడు మెడ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు ప్రగతి నగర్ నాయకులు వడ్లకొండ సందీప్, బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, హరీష్, శివ రామ కృష్ణ, స్థానిక మహిళలు, భక్తులు మరియు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొని, యాత్ర పొడవునా స్వామివారికి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. రథయాత్ర విజయవంతం కావడానికి సహకరించిన భక్తులందరికీ మరియు నిర్వాహకులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు.

## మండలంలో పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న

# అక్రమ ఫామ్ ల్యాండ్ రిసార్ట్‌లు

- కంపెనీలు,ఫామ్ ల్యాండ్ వెంచర్లు,ఫంక్షన్ హాల్ లు - అటువైపు కన్నెత్తి చూడని మండల అధికారులు
- గ్రామపంచాయతీకి రావలసిన నిధుల సేకరణ విషయంలో చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా?







బొమ్మలరామారం (ప్రజా కలం) జూలై 18

యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలంలోని వివిధ గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అనుమతులేని రిసార్ట్ లు, కంపెనీలు,ఫంక్షన్ హాల్. గ్రామపంచాయతీ కార్యదర్శి,మండల పంచాయతీ అధికారులు అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానానికి దారితీస్తుంది గ్రామ పంచాయతీకి రావలసిన నిధుల విషయంలో మండల పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడానికి గల కారణమేమిటని గ్రామ ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు గ్రామ పంచాయతీ పరిధిలో కంపెనీ,ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయాలంటే గ్రామపంచాయతీ నుండి ఎన్ఓసి, గ్రామ పంచాయతీ తీర్మానం లాంటివి కచ్చితంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది కానీ ఎలాంటి అనుమతి లేకుండా గ్రామ పంచాయతీలకు రావలసిన లక్షల రూపాయల దారి మళ్లిస్తూ అక్రమ మార్గంలో నిర్మాణాలు చేపడుతున్న గ్రామపంచాయతీ కార్యదర్శి,మండల పంచాయతీ అధికారి చూసి చూడనట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు దారితీస్తున్న విషయం. అధికారులకు తెలియనిదే ఇదంతా జరుగుతుందా అని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు మండల ప్రజా సంఘాల నాయకులు ఆర్టిఏ కార్యకర్తలు సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరిన గ్రామాలలో ఎలాంటి కంపెనీలు,ఫంక్షన్ హాల్ లు, రిసార్ట్ లకు సంబంధించిన ఎలాంటి అనుమతులు లేవని సమాధానం ఇచ్చిన చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు ఎందుకు వేస్తున్నారో అని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామపంచాయతీలకు లక్షల రూపాయలు రావలసిన డబ్బులను రానివ్వకుండా అడ్డదారిలో చీకటి ఒప్పందం చేసుకుంటున్న అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు అక్రమ కట్టడం దారులకు అధికారులకు చీకటి ఒప్పందం ఉందని వాపోతున్నారు వ్యవసాయ భూములలో పామ్ ల్యాండ్ రిసార్ట్ లు,ఫంక్షన్ హాల్ లు, కంపెనీలు నిర్మాణం చేపట్టాలంటే వ్యవసాయేతర భూమిగా తహసిల్దార్ కార్యాలయంలో నాలా ( చీూూూ)అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టాలి ఇలాంటి నిర్మాణాలు చేపడుతున్న భూమికి నాలా అనుమతులు ఉన్నాయా అని మండల రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి ఇంత జరుగుతా ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్న జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం

మండల పంచాయతీ అధికారి వివరణ

గ్రామాలలో ఎలాంటి అక్రమ కట్టడాలు,ఫామ్ ల్యాండ్ రిసార్ట్ లు,ఫంక్షన్ హాల్ లకు సంబంధించిన కట్టడాల పైన గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు అక్రమ కట్టడాలు మా దృష్టికి రాలేదు వస్తే పంచాయతీరాజ్ ఆక్ట్ చట్టం కింద చర్యలు తీసుకుంటాం

## హైదరాబాద్‌ను దేశద్రోహ శక్తుల నుంచి కాపాడుకోవడమే లక్ష్యం

### : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

### ఎస్ ఐ ఆర్ తో తెలంగాణ బీజేపీ గెలుపు ఖాయం

సికింద్రాబాద్, జూలై 18: ప్రజాకలం ప్రతినిధి

హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా, దేశద్రోహ శక్తుల బారి నుంచి కాపాడుకోవాలన్నా రాబోయే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం చారిత్రక అవసరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు



భారత్ గౌడ్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గాల సమీక్షా సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఉదాసీనత వల్ల హైదరాబాద్‌ను ఎంఐఎం చేతుల్లోకి పెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ముఖ్యంగా పాతబస్తీ తరహాలో ఇతర ప్రాంతాల్లోనూ దొంగ ఓట్లను చేర్చుతూ అధికారులను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రధాని మోడీ నాయకత్వంలో 83 కోట్ల మందికి ఉచిత బియ్యం, డిజిటల్ విప్లవం, కరోనా వ్యాక్సిన్ల ఎగుమతి, పటిష్టమైన రక్షణ రంగం లాంటి అద్భుతాలు జరుగుతుంటే, తెలంగాణలో మాత్రం ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. ఇందుకోసం ఈ నెల 26న నిర్వహించే ‘మన్ కీ బాత్’ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. పార్టీ శాశ్వతమని, పదవులు కావని, నేతలంతా సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. ఇదే నెల 26న కొమురవెల్లిలో నూతన రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఎస్ ఐ ఆర్ ని సనత్ నగర్, ముషీరాబాద్, కంటోన్మెంట్, సికింద్రాబాద్ లో ప్రజలు వినియోగం చేసుకునేలా చర్య లు తీసుకో వాలని సూచించారు. మూడు మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరాలని ఆదేశించారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు భారత్ గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో ఓటరు లిస్ట్ రివిజన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ చొరబాటుదారుల పేరిట దొంగ ఓట్లు చేరుస్తున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్నారని, హైదరాబాద్ అభివృద్ధికి రూ. 778 కోట్లతో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేపట్టారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ నాయకులు, డివిజన్ ఇన్చార్జులు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్తలకు సంతాప తీర్మానం సమర్పించారు.




## రూ.2.60 కోట్లతో మల్కాజిగిరి రేణుకానగర్‌లో అభివృద్ధి పనులు

### -పర్యేక్షించిన మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి - పాత విద్యుత్ స్తంభాల తొలగింపు,కొత్తవి ఏర్పాటు



మల్కాజిగిరి:జులై 18: ప్రజాకలం ప్రతినిధి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాకతీయనగర్ డివిజన్ రేణుకానగర్‌లో సుమారు రూ.2.60 కోట్ల వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే క్రమంలో తలెత్తిన స్థానిక వివాదాన్ని ఆమె విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సామరస్యంగా పరిష్కరించారు. ఇంటి గోడకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం వల్ల తలెత్తే ప్రమాదాన్ని నివారించేందుకు, ప్రజల భద్రత దృష్ట్యా మరో అదనపు స్తంభాన్ని ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఏఈని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.మరోవైపు స్థానికంగా బాక్స్ డ్రెయిన్ నిర్మాణ సమయంలో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్ సమస్యపై వాటర్ వర్క్స్ జీఎం సునీల్‌తో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. పైప్ లైన్‌ను భూగర్భంలో ఏర్పాటు చేస్తే రహదారి పునరుద్ధరణ పనులు వేగవంతం అవుతాయని సూచించగా, వారం రోజుల్లోగా పనులు పూర్తి చేస్తామని జీఎం హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అమె హామీ ఇచ్చారు..



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013 Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com